ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 14 అక్టోబరు 2024



ముగిసిన దసరా ఉత్సవాలు

ఈ నెల 3న ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శమీ వృక్ష పూజలతో శనివారం రాత్రి ముగిశాయి. తొమ్మిది రోజులు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చిన అమ్మవారు పదో రోజైన శనివారం శాంతమూర్తి అవతారమైన రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. దేవతా మూర్తులకు ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. జిల్లావాసులు విజయదశమి పర్వదినాన్ని వైభవంగా జరుపుకున్నారు. వేకువజామునుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. దీంతో ఆలయాలు కిటకిట లాడాయి. అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు జరిగాయి.

- నరసరావుపేట


నాదెండ్ల: గణపవరంలో లలితా త్రిపుర సుందరి అవతారంలో అమ్మవారు


నరసరావుపేటలోని శృంగేరి శంకరమఠంలో రాజరాజేశ్వరిగా శారదా అమ్మవారు


నరసరావుపేట శివాలయంలో రాజరాజేశ్వరీదేవిగా పార్వతీదేవి


వినుకొండ: ప్రత్యేక అలంకరణలో కన్యాక పరమేశ్వరి


పెదకూరపాడులో అమ్మవారి ప్రత్యేక అలంకారం



మరో రెండు రైలు మార్గాలు

- కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం
- సర్వేల దశలో ఉన్న రెండు రైల్వే ప్రాజెక్టులు
- ఇవి ఏర్పాటైతే ఉమ్మడి గుంటూరు జిల్లాకు నలువైపులా కనెక్టివిటీ
- రైల్వే మంత్రి వైష్ణవ్‌తో ఇటీవల సీఎం చంద్రబాబు సమావేశంలో చర్చ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు మరో రెండు కొత్త రైలు మార్గాలు మంజూరు కానున్నాయి. ఇప్పటికే ప్రిలిమినరీ-కమ్-ట్రాఫిక్, ఫైనల్ లొకేషన్ సర్వేలు పూర్తి చేసుకున్నాయి. అయితే ఈ ప్రాజెక్టులు గత కొన్నేళ్ల నుంచి రైల్వే శాఖ అటకెక్కించింది. ప్రస్తుతం కేంద్రం, రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉండటం, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టీడీపీ, జనసేన ఎంపీలపై కేంద్ర ప్రభుత్వం ఆధార పడటంతో అటకెక్కించిన ఆ ప్రాజెక్టులను చేపట్టేందుకు రైల్వే శాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సీఎం చంద్రబాబునాయుడు జరిపిన సమావేశంలోనూ ఈ రెండు ప్రాజెక్టులపై చర్చ జరగడం సానుకూల వాతావరణాన్ని ఏర్పరుస్తున్నది. సాధ్యమైనంత త్వరగా వీటిని రైల్వే కేటాయింపులు (పింక్‌బుక్)లో చేర్చి నిధులు మంజూరు చేస్తే మూడు, నాలుగేళ్లలో ప్రాజెక్టులు పూర్తి అయ్యే అవకాశం ఉన్నది.

మచిలీపట్నం - రేపల్లె - బాపట్ల

మచిలీపట్నం-రేపల్లె నూతన రైలుమార్గం నిర్మాణం చేయాలన్నది దశాబ్దాలుగా తీర ప్రాంతాల ప్రజల ఆకాంక్ష. ఈ రెండు పట్టణాల మధ్య కేవలం 45.30 కిలోమీటర్ల దూరం ఉన్నది. రైలుమార్గంతో కలిపితే పలు రైళ్లని చుట్టూ తిరిగి విజయవాడ వైపునకు వెళ్లకుండా రేపల్లె-తెనాలి మీదగా మళ్లించొచ్చు. పైగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రముఖ నగరాలకు ప్రయాణ దూరం కూడా తగ్గుతుంది. అయితే ఈ మార్గంలో క్లిష్టమైన కృష్ణా నదిపై మూడు కిలోమీటర్ల దూరం పైగా వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఇందుకు కారణం ఇక్కడ కృష్ణానది వెడల్పు పాయలు గా విడిపోయి ఎక్కువగా ఉంటుంది. అయినా ఎట్టకేలకు గత ఆగస్టు నెల 20న ఫైనల్ లొకేషన్ సర్వేని రైల్వేశాఖ మంజూరు చేసింది. ఈ సర్వే పూర్తి అయితే రైలు మార్గం నిర్మాణం చేపట్టడానికి వీలు కలుగుతుంది. రేపల్లె - బాపట్ల నూతన రైలుమార్గం ప్రిలిమినరీ ఇంజనీరింగ్- కమ్- ట్రాఫిక్ సర్వే కూడా మంజూరైంది. దీనిని నిజాంపట్నం పోర్టు మీదగా సర్వే చేసి రిపోర్టు కూడా పంపించారు. రూ.792.33 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. రేట్ ఆఫ్ రిటర్న్ చూసుకుంటే -8.72 శాతంగా రావడంతో రైల్వే శాఖ 2017లోనే దీనిని అటకెక్కించింది. ఇప్పుడు సరుకు రవాణాకు సదుపాయాలను పెంచుతుండటంతో ఈ ప్రాజెక్టుని చేపట్టేందుకు రైల్వే మంత్రి అంగీకరించినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు.

తెనాలి - రేపల్లె మధ్య డబ్లింగ్..

తెనాలి-రేపల్లె మధ్యన డబ్లింగ్, విద్యుద్దీకరణ ప్రాజెక్టుకు సంబంధించి ప్రిలిమినరీ ఇంజనీరింగ్ కమ్ ట్రాఫిక్ సర్వే 2015 లోనే పూర్తి అయింది. దీనికోసం రూ.259.91కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే రేట్ ఆఫ్ రిటర్న్ -25.35 శాతంగా ఉండటంతో రైల్వేశాఖ పక్కన పెట్టేసింది. దీనిని కూడా ఇప్పుడు చేపట్టేందుకు రైల్వేశాఖ అంగీకారం తెలిపింది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు రెండు కొత్త రైలు మార్గాలతో పాటు ఒక డబ్లింగ్ రాబోతున్నది.

లక్కీ ఎవరికో?

- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ
- మద్యం షాపులకు నేడు లాటరీ
- ఉదయం 7 నుంచి ప్రక్రియ ప్రారంభం
- బాపట్లలో 117 షాపులకు 2149 దరఖాస్తులు
- పల్నాడు జిల్లాలో 129 దుకాణాలకు 2639..
- గుంటూరులో 127 షాపులకు 4448 దరఖాస్తులు

నరసరావుపేట, బాపట్ల(ఆంధ్రజ్యోతి), గుంటూరు కార్పొరేషన్, అక్టోబరు 13: ఇప్పటివరకు మద్యం విక్రయాలను ప్రభుత్వం చేపట్టగా ఆ స్థానంలో వ్యాపారులు రానున్నారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో మద్యం వ్యాపారంపై ఆసక్తి ఉన్న వారి నుంచి ప్రభుత్వం దుకాణాల వారీగా దరఖాస్తులను స్వీకరించింది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో దుకాణాలకు పలువురు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఈ దరఖాస్తుల ప్రక్రియ సోమవారం జరగనున్న లాటరీ అంకంతో ఓ కొలిక్కి రానుంది. సిండికేట్ మంతనాలు.. స్థానికేతరుల అంశంలో బెదిరింపులు.. ఇలా ఎన్నో ప్రతిబంధకాల మధ్య పది రోజులకు పైగా దరఖాస్తుల ప్రక్రియ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సాగింది. శుక్రవారం రాత్రితో దరఖాస్తుల అంకం ముగియగా శని, ఆదివారాల్లో పరిశీలనలు జరిగాయి. ఆయా దరఖాస్తుల లాటరీ సోమవారం జిల్లా కేంద్రాల్లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే అదృష్టం ఎవరిని వరిస్తోందోనని రూ.2 లక్షలు ఫీజు కట్టి దుకాణాలకు దరఖాస్తులు చేసుకున్న వారిలో ఉత్కంఠ నెలకొంది. దరఖాస్తుదారులు ఉదయం 7 గంటలకే లాటరీ తీసే కేంద్రాలకు రావాలని 8 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. దరఖాస్తుదారులు మాత్రమే రావాలని బయటవారెవరికీ దానిలోకి ప్రవేశం లేదని అధికారులు తెలిపారు. మొత్తం ప్రక్రియ కలెక్టర్, జేసీల సమక్షంలో జరుగుతుందని, వీడియోగ్రఫీ కూడా తీస్తామని చెప్పారు. లాటరీలో షాపు దక్కించుకున్న వారికి 15న లైసెన్సులు అందిస్తామన్నారు. లాటరీలో అదృష్టం వరించిన వ్యాపారి రెండు రోజుల్లో షాపు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు తెలిపారు.


ప్రసంగిస్తున్న గుంటూరు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ కే శ్రీనివాసులు, పక్కన ఏసీ రవికుమార్ రెడ్డి, ఈఎస్ అరుణకుమారి

16 నుంచి ప్రైవేట్ మద్యం షాపులు ప్రారంభం కానున్నాయి. లాటరీ తీసే కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. లాటరీ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ చర్యలు చేపట్టారు. బాపట్ల జిల్లాలోని 117 షాపులకు 2149 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 18 దరఖాస్తులు వచ్చినట్లైంది. గుంటూరు జిల్లాలోని 127 షాపులకు అత్యధికంగా 4448 దరఖాస్తులు వచ్చాయి. సగటున ఒక్కో షాపునకు 35 దరరఖాస్తులు వచ్చినట్లైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 129 షాపులకు 2,639 దరఖాస్తులు దాఖలు కాగా సగటున ఒక్కో షాపునకు 20 దరఖాస్తులు వచ్చినట్లైంది. మద్యం షాపుల కేటాయింపులో నెలకొన్న ఉత్కంఠకు మరి కొద్ది గంటల్లో తెరపడనున్నది. పల్నాడు ప్రాంతంలో ఒక్కో వ్యాపారి పది షాపుల వరకు దరఖాస్తులు దాఖలు చేశారు. కొందరు వ్యాపారులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులు వేశారు. ఏ షాపు ఎవరికి దక్కుతుందోన్న ఉత్కంఠ దరఖాస్తుదారుల్లో నెలకొంది.

- బాపట్ల జమ్ములపాలెం రోడ్డులోని ఎమ్మెస్సార్ కల్యాణ మండపంలో లాటరీ ప్రక్రియ సోమవారం జరగనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ దేవదత్తు తెలిపారు. స్టేషన్ల వారీగా లాటరీ తీయడం జరుగుతుందని, ఇందుకు 2 కౌంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కల్యాణమండపం వద్ద 120 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేశారు.
- నరసరావుపేట ప్రకాష్‌నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాల్‌లో మద్యం షాపుల లాటరీ తీయనున్నారు. లాటరీ నిర్వహణ ఏర్పాట్లను ఎక్సైజ్ ఈఎస్ మణికంఠ పర్యవేక్షిస్తున్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు లాటరీ తీయనున్నారు.
- గుంటూరు జిల్లాకు సంబంధించి గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు గుంటూరు ఎక్సైజ్ డీసీ డాక్టర్ కే శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గుంటూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెండు కౌంటర్ల ద్వారా లాటరీ నిర్వహిస్తామన్నారు. ఒక కౌంటర్‌కు కలెక్టర్, మరో కౌంటర్‌కు జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ ప్రక్రియ జరుగుతుందన్నారు. సమావేశంలో ఏసీ రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.


బాపట్ల: ఎమ్మెస్సార్ కల్యాణమండపం వద్ద లాటరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

విజేతలు వెంటనే ఫీజు చెల్లించాలి..

దుకాణాలకు వచ్చిన దరఖాస్తుల నుంచి లాటరీ తీసి లైసెన్సు పొందిన వారి పేర్లను అధికారులు ప్రకటించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. లాటరీతో పాటు లైసెన్సుల జారీ చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరుగుతుందని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. లైసెన్సులు జారీకి షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులను లాటరీ తీసి విజేతను ఎంపిక చేస్తారు. దీనితో పాటు మరో ఇద్దరిని రిజర్వుగా ఎంపిక చేయనున్నారని తెలిసింది. లాటరీలో లైసెన్సు దక్కించుకున్న వారు వెంటనే నిర్దేశిత మొత్తాన్ని ఎక్సైజ్ శాఖకు చెల్లించాలి. ఇలా సకాలంలో ఎవరైనా నగదు చెల్లించకపోవడంతో పాటు ఏదైనా అత్యవసర కారణాల వల్ల లాటరీలో షాపు వరించిన వ్యక్తి పక్కకు తప్పుకుంటే నిబంధనల ప్రకారం రిజర్వులో ఉన్న తొలి వ్యక్తికి అవకాశం కల్పించనున్నారు. బ్యాంకర్లను కూడా ఆయా వేదికల వద్దే ఏర్పాటు చేశారు. లాటరీలో గెలుపొందిన వ్యక్తి షాపు దరావత్ ఫీజులో 1/6 వంతు అప్పటికప్పుడు అక్కడే చెల్లించే విధంగా సౌకర్యం కల్పించామన్నారు.

లైసెన్సును మార్చడానికి వీల్లేదు

తెరవెనక బేరసారాలతో లాటరీలో విజేత నుంచి లైసెన్సును పొందడం సాంకేతికంగా చెల్లదని ఎక్సైజ్ శాఖ చెబుతోంది. ఒక వేళ ఏదైనా సహేతుక కారణాలతో లైసెన్సును వేరే వారిపేరు మీదకు మార్చాలనుకున్నా అది జీపీఏ రూపంలోనే వర్తిస్తుందని దానికి కూడా దరఖాస్తుదారుడు లక్షల్లోనే అదనపు రుసుం చెల్లించాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. లాటరీ, దుకాణం ఏర్పాటు ప్రక్రియ మార్గదర్శకాలకు అనుగుణంగానే జరుగుతుందని ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఉండదన్నారు. లాటరీలో విజేతలుగా నిలిచినవారు మాత్రమే షాపు పెట్టుకోవడానికి అర్హులని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

బేరసారాలకు రంగం సిద్ధం..

మద్యం వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు దుకాణాల దరఖాస్తుల ప్రక్రియలో పాలకపార్టీ నేతలు జోక్యం చేసుకున్నారు. దీంతో చాలాదగ్గర్ల దరఖాస్తులు వేసేందుకు వ్యాపారులు వెనుకంజ వేశారు. ఈ పరిస్థితుల్లో నేతల తీరుపై టీడీపీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో సిండికేట్ ప్రతిపాదనల నుంచి నేతలు వైదొలిగారు. దాని ఫలితమే గడువు పొడిగించిన చివరి రెండు రోజుల్లో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. అయితే ఆయా నేతల కన్ను ప్రస్తుతం లాటరీలో షాపు దక్కించుకునే వారిపై పడినట్లు తెలిసింది. బాపట్ల జిల్లాలో నేతల దృష్టంతా లైసెన్సుల దక్కేవారిపై ఉన్నట్లు సమాచారం. లైసెన్సును టోకుగా కైవశం చేసుకోవడమో లేదంటే తాము సూచించిన వ్యక్తులను భాగస్వాములుగా చేర్చుకునే విధంగా విజేతలతో మంతనాలు జరపడానికి జిల్లాలో నేతలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

పల్లెల్లో అభివృద్ధి పండుగ

- నేటి నుంచి 20 వరకు వారోత్సవాలు
- ప్రతీ గ్రామంలో వివిధ పనులకు శంకుస్థాపనలు
- బాపట్ల జిల్లాలో 600 పనులకు రూ.72 కోట్లతో శ్రీకారం
- పల్నాడు జిల్లాలో 9,397 పనులు.. వ్యయం రూ.286.15 కోట్లు
- గుంటూరు జిల్లాలో 166 పనులకు రూ.14.35 కోట్ల మంజూరు

నరసరావుపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం.. నిధుల లేమి.. కేంద్రం నిధుల దారి మళ్లింపు.. సచివాలయాలతో ఉత్సవ విగ్రహాలుగా మారిన పంచాయతీలు.. మొత్తం మీద వైసీపీ పాలనలో పల్లెలు అభివృద్ధి లేక కుంటుపడిపోయాయి. ఈ పరిస్థితుల్లో పంచాయతీలను పురోగమన బాట పట్టించడానికి కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. పంచాయతీలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఆగస్టులో ఒకేరోజు గ్రామసభల నిర్వహణ.. సమస్యలపై వినతుల స్వీకరణ.. అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమానికి కొనసాగింపుగా సోమవారం నుంచి వారం రోజులు పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ పండుగ వారోత్సవాల్లో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపనలు చేయనున్నారు. పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు గ్రామాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రోజుకు 15 గ్రామాలకు తగ్గకుండా అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు ప్రణాళికలు రూపొందించారు. రోడ్లు, మురుగుకాల్వలు, తాగునీరు వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించనున్నారు. 15వ ఆర్థిక సంఘం, ఉపాధి హామీ పథకం కింద పల్లెలో ప్రగతి పనులకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకం కింద చేపట్టనున్న పనులను గుర్తించి అంచనాలను కూడా అధికారులు రూపొందించారు. గ్రామాల వారీగా మొత్తం 46 రకాల పనులకు ఆమోదం తీసుకున్నారు. ఆయా పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవాలు చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి. ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణ నిమిత్తం ఆగస్టు 23న జరిగిన గ్రామసభల్లో ప్రజాభిప్రాయం మేరకు తీర్మానాలు కూడా చేశారు.

- గుంటూరు జిల్లాలోని 166 గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ.14.35 కోట్లను ప్రభుత్వం విడుదల చేయనుంది. తొలి రోజున మంగళగిరి నియోజకవర్గంలో గొడవర్రు, పెదకొండూరు, వీర్లపాలెం, పొన్నూరు నియోజకవర్గంలో మాచవరం, ములుకుదురు, నండూరు, శేకూరు, వీరనాయకునిపాలెం, ప్రత్తిపాడు నియోజకవర్గంలో జొన్నలగడ్డ, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గంలో దామరపల్లి, కంతేరు, ఫణిదరం, పొన్నెకల్లు, తెనాలిలోని అంగలకుదురు, చావావారిపాలెం గ్రామాల్లో జరగనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు స్థానిక ఎమ్మెల్యేలు హాజరౌతారని డ్వామా అధికారులు తెలిపారు.
- బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న 458 పంచాయతీల పరిధిలో 600 పనులకు రూ.72కోట్ల వ్యయం చేయనున్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో సంతమాగులూరు మండలం ఏల్చూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొననున్నారు. చుండూరు మండలం యడ్లపల్లిలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పలు పనులకు భూమి పూజ చేయనున్నారు
- పల్నాడు జిల్లాలో రూ.286.15 కోట్లతో 9,397 పనులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.



అందుబాటులోకి బైక్ అంబులెన్స్

- ప్రారంభించిన ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 13: దీర్ఘాయుష్మాన్ భవ హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారి దీర్ఘాయుష్మాన్ బైక్ అంబులెన్స్‌ను ఎస్పీ కంచి శ్రీనివాసరావు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆపద సమయంలో ప్రతి నిమిషం ఎంతో కీలకమైనదన్నారు. అటువంటి సమయంలో దీర్ఘాయుష్మాన్ బైక్ అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే డాక్టర్‌తో పాటు ఓ నర్సు ప్రమాదం జరిగిన ప్రాంతానికి చేరుకుని ప్రథమ చికిత్స అందిస్తారన్నారు. అంబులెన్స్ వచ్చేలోపు బాధితులకు అత్యవసర మందులు, ఆక్సిజన్ అందిస్తారని తెలిపారు. ఆ తర్వాత అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపిస్తారని తెలిపారు. ఈ బైక్ అంబులెన్స్ సేవలు ఉచితమని చెప్పారు. ఈ సేవ 24 గంటలు అందుబాటులో ఉంటుందన్నారు. బైక్ సేవల కోసం 8340000108, 8186000108 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతా కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.


బైక్ అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు



రైళ్లు కిటకిట

- దసరా సెలవులు ముగియడంతో వేల మంది తిరుగు ప్రయాణం
- టిక్కెట్లు కన్‌ఫర్మ్ కాక ఫుట్‌బోర్డు వద్ద వేలాడుతూ జర్నీ



7లో..

దిక్సూచి DIKSUCHI

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ జాగ్రఫీ

పర్యావరణం - అధ్యయనం

పర్యావరణం-అధ్యయనానికి సంబంధించి గతంలో వాతావరణం, పర్యావరణాల్లోని పలు విషయాలను తెలుసుకున్నాం. ఇప్పుడు వివిధ ఆవరణాల వివరాలను తెలుసుకుందాం.

జలావరణం

ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో హైడ్రోస్పియర్ అని అంటారు. గ్రీకుభాషలో హర్యాడర్ అనగా జలం అని అర్థం. 'భూమిపై ఉన్న జల వనరులన్నీ అనగా సముద్రాలు, నదులు, జలాశయాలు, కుంటలు, సరస్సులు వాటన్నింటినీ కలిపి జలావరణం అంటారు. హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువుల కలయిక వల్ల హెచ్‌టూ2(జలము) ఏర్పడుతుంది.

- భూ ఉపరితలంపై 71% అనగా 2/3వ వంతు జలభాగం ఆవరించింది. దీనిలో 1) సముద్రాల్లోని ఉప్పునీటి శాతం 97.3% 2) మంచినీటి శాతం 2.7%
- ఆర్కిటిక్, అంటార్కిటిక్ ప్రాంతంలో ఘనస్థితిలో ఉన్న మంచినీటి శాతం 2.14%
- చెరువులు, కుంటలు, సరస్సుల్లో ఉన్న ద్రవస్థితిలో ఉన్న మంచినీటి శాతం 0.0009%
- నదులు, చెరువులు, కాలువల్లో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- వాతావరణంలోని తేమ రూపంలో ఉన్న మంచినీటి శాతం 0.0001%
- భూగర్భంలో ఉన్న మంచినీటి శాతం 0.61%
- జల సంబంధిత చక్రం కీలకపాత్ర వహిస్తూ జీవులకు ఆధారమైన నీటిని సమకూర్చడంలో ముఖ్యపాత్ర వహిస్తుంది.

శిలావరణం

భూమిలో ఘనీభవించిన పొర, లేదా గట్టిగా ఉండే పైపొర ఇది. దీనిలో రాళ్లు, ఖనిజ లవణాలు ఉండి మందపాటి మట్టి పొర ఉంటుంది. గ్రీకుభాషలో లిథోస్ అనగా శిల అని అర్థం. స్పేయిరా అంటే గోళం లేదా బంతి. ఈ ఆవరణాన్ని ఆంగ్లభాషలో లిథోస్పియర్ అంటారు. దీనిని ఆశ్మావరణం అని కూడా పిలుస్తారు. భూమి, దానిపై ఘనరూపంలో ఉండే భాగాలన్నింటిని శిలావరణం అంటారు.

- భూ ఉపరితలం నుంచి సగటున 40 కి.మీ. లోతు వరకు విస్తరించి ఉన్న ఘనస్థితిలోని భూమి బాహ్యపొర.
- భూమిపై ఉండే పర్వతాలు, మట్టిపొరలు, పీఠభూములు, రాళ్లు మొదలైనవి శిలావరణం కిందికి వస్తాయి.
- భూమి ఉపరితలం పొరను సాంద్ర మండలం అంటారు.

భూమి పొరల్లో ఉండే మట్టి ఖనిజాలు, ఖనిజ ఇంధనాలు మొదలైనవి శిలావరణంలో చేరతాయి.

జీవావరణం

పర్యావరణ వ్యవస్థలోని వాతావరణం, జలావరణం, శిలావరణాలు వ్యాపించి జీవులకు అనువైన ఆవరణ భాగాన్ని జీవావరణం అంటారు. జీవావరణం భూ ఉపరితలం మీదనూ, భూ ఉపరితలం నుంచి దాదాపు 200 మీ. లోతు వరకు, భూ ఉపరితలం వాతావరణంలో దాదాపు 7 నుంచి 8 కి.మీ. ఎత్తు వరకు విస్తరించి ఉంది.



- సూక్ష్మక్రిములు, బ్యాక్టీరియా, వైరస్, మొక్కల నుంచి వెలువడే బీజాంకురాలు, పుప్పొడి కణాలు వాతావరణంలోని వాయువుల ద్వారా అంతటా వ్యాపిస్తాయి.
- అలాగే కోట్లాది జీవులు సముద్ర జలాల్లో నివశిస్తున్నాయి. కాబట్టి జీవులకు అనువైన జలావరణం, వాతావరణం, శిలావరణం వీటన్నింటినీ జీవావరణం అంటారు.
- జీవావరణంలో జీవుల మధ్య పరస్పరము ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటుంది. వీటినే ఉత్పత్తిదారులు వినియోగదారులు, విచ్ఛిన్నకారులు అంటారు.

పర్యావరణంపై మానవుని ప్రభావం

సహజసిద్ధ పర్యావరణంలో భూమిపై నివశిస్తున్న భిన్నరకాల జీవజాతులు, చుట్టూ ఉన్న పరిసరాలకు అనుగుణంగా, పరిసరాలకు లోబడి నివసించేవి. ప్రతి జీవి జీవన చర్యలను వాటి చుట్టూ ఉన్న పర్యావరణంలోని వనరులు నియంత్రిస్తాయి.

- సహజసిద్ధ పర్యావరణంలో జీవులకు, వాటి చుట్టూ ఉన్న పరిసరాలకు మధ్య గల సంబంధాలు సకారాత్మకంగా ఉన్నందున పర్యావరణ సమతుల్యం స్థిరంగా ఉంటుంది.
- జీవరాశులన్నింటిలో ఒక్క మానవునికి మాత్రమే తన పరిసరాల్లోని సహజ వనరులను వివిధ రూపాల్లో వినియోగించుకునే సామర్థ్యం ఉంది.
- ప్రాచీన మానవుడు తన కనీస అవసరాలు(గాలి, నీరు, నేల, ఆవాసం) మేరకే సహజ వనరులను వినియోగించేవాడు. దీనిలో భాగంగా ఏర్పడే వ్యర్థాలను తన చుట్టూ ఉన్న పర్యావరణం సులభంగా తనలో ఇముడ్చుకునేది.
- మానవుడు నిప్పును కనిపెట్టడంతో పర్యావరణంపై మానవ ప్రభావం ప్రారంభమైంది. దీనితో క్రూర మృగాలను దెబ్బతీయడం, అడవులను తగులపెట్టి వ్యవసాయ భూములుగా మార్చడం, స్థిర వ్యవసాయాన్ని ప్రారంభించడంతో ఆవరణ వ్యవస్థలపై మానవుని ప్రభావం వేగవంతమైందని చెప్పవచ్చు.

పారిశ్రామిక విప్లవం తరవాత పర్యావరణంపై మానవ ప్రభావం పెరగడానికి, పర్యావరణ వనరులు క్షీణించడానికి గల కారణాలు

1) జనాభా పెరుగుదల 2) వేగంగా విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, పట్టణీకరణ 3) ఆధునిక ప్రపంచ ఆర్థిక పోకడలు(సరళీకరణ, ప్రపంచీకరణ) 4) శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం 5) కొత్త వినిమయ సంస్కృతి కారణంగా ఘన వ్యర్థాలు పెరగడం.

- ఉపాధికి ప్రజలు పట్టణాలకు వలస వెళ్లడం వల్ల అక్కడ జనాభా పెరిగి నగర ఆవరణ వ్యవస్థలు కాలుష్యానికి గురయ్యాయి. మురికివాడల సంఖ్య పెరిగింది.
- మానవుడు తన సాంకేతిక నైపుణ్యం ద్వారా తన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని తనకు అనుకూలంగా మార్చుకోవడంతో సహజ ఆవరణ వ్యవస్థ తన స్వభావాన్ని మార్చుకోవడంతో సహజ వనరుల నాణ్యత తగ్గి జీవ వైవిధ్యత దెబ్బతింటుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిని అధికం చేసే ప్రయత్నంలో హరితవిప్లవ సాంకేతిక పద్ధతులు ఉపయోగించడం వల్ల జల వనరులు కాడ్మియం, ఫ్లోరిన్, లెడ్ లాంటి భార లోహకాలతో కలుషితమయ్యాయి.
- మానవుడు అభివృద్ధి కార్యకలాపాలు, ఆర్థిక ప్రయోజనాలకు, విలాసవంతమైన జీవనానికి భవిష్యత్ తరాలకు అందించాల్సిన వనరులను కూడా దెబ్బతీస్తున్నాడు. దీని ఫలితమే గ్లోబల్ వార్మింగ్, ఆమ్ల వర్షాలు, ఓజోన్ పొర క్షీణత, జల వనరుల కొరత, భూకంపం, సునామీలు ఏర్పడుతున్నాయి.
- పై వాటితో పాటు నివాస, పారిశ్రామిక ప్రాంతాల నుంచి విడుదలయ్యే మురుగు, పంట పొలాలు, చేపల చెరువులు, రొయ్యల చెరువుల నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, పోషకాలు జలాశయాల్లో చేరుతున్నాయి. దాంతో జలాశయాలు యూట్రిఫికేషన్ కాలుష్యానికి లోనై సాగు, తాగు నీటికి పనికిరాకుండా పోతున్నాయి.
- అదేవిధంగా కోస్టల్ కారిడార్ నిర్మాణాలు, ట్రాలరీ బోట్స్, డీప్ - సీ - ఫిషింగ్ విధానాల వల్ల కోస్తా ఆవరణ వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.
- పైన తెలిపిన ధోరణులను పరిశీలిస్తే మానవుడు తన జీవన శైలిని పర్యావరణ సామర్థ్యానికి అనుకూలంగా మార్చుకోవాలి. పర్యావరణానికి, మానవునికి మధ్య సంబంధాలు సహకారాత్మకంగా ఉండాలి. లేకపోతే పర్యావరణ ఆధిపత్యం శీతోష్ణస్థితిలో మార్పుల రూపంలో అధికమై జీవజాతి మనుగడే ప్రమాదంలో పడుతుంది.
- మానవుడు అభివృద్ధి కార్యక్రమాల్లో చేపట్టే చర్యల వల్ల ఏర్పడే పర్యావరణ క్షీణతను జీవావరణ వధ అని పిలుస్తారు. ఈ పదాన్ని మొదటి సారిగా 1972లో స్టాక్‌హోమ్‌లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ సదస్సులో ఉపయోగించారు.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ



రీజనింగ్

పాచికలు టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలలో ఒక పాచిక రెండు లేదా మూడు లేదా నాలుగు స్థితులను(పొజిషన్) ఇస్తుంటారు. ఆ డయాగ్రామ్స్‌లో అంకెలను లేదా వర్ణమాల అక్షరాలను లేదా చుక్కలను లేదా మేథమెటికల్ గుర్తు (+, -, x, ÷)లను లేదా చిన్న చిన్న రేఖాచిత్రాలను (△, □, ▭, ▯) ఇస్తారు. డయాగ్రామ్స్‌లో ఇచ్చిన ఏదేని అంకె లేదా చుక్కలు లేదా వర్ణమాల అక్షరాల్లో ఏదో ఒక దానిని తెలుపుతూ దానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె లేదా అక్షరం లేదా గుర్తు లేదా రేఖాచిత్రాన్ని తెలపమని అడుగుతారు.


పాచికకు(సిక్స్ సైడ్స్) ఆరు ముఖభాగాలు ఉంటాయి. ప్రతి ముఖభాగానికి ఎదురు ముఖభాగం అనేది ఉంటుంది. ఎదురు ముఖభాగం అనేది కనిపించదు. ప్రతి ముఖ భాగానికి (ఫోర్ సైడ్స్) నాలుగు పక్కపక్క ముఖభాగాలు కనిపించే విధంగా ఉంటాయి. ఒక ముఖభాగం కనిపించదు. కనిపించని ముఖభాగాన్ని ఎదురు ముఖభాగంగా గుర్తించాలి. ఈవిధంగా పాచికకు ఆరు ముఖభాగాలు ఉంటాయి.

ఆరు ముఖభాగాలు ఉండే పద్ధతి (రూల్)

అడిగినటువంటి ముఖభాగంలో గల అక్షరం		దానికి కనిపించే విధంగా నాలుగు పక్క ముఖభాగాలు		అడిగినటువంటి ముఖభాగానికి ఎదురుగా (కనబడకుండా) ఉండే ముఖభాగం
1	+	4	+	1
				= 6 (సిక్స్ సైడ్స్)

గమనిక: ఏదేని ఒక ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగం కనబడదు అనేది అర్థమైనది. ఈ టాపిక్‌కి సంబంధించిన ప్రశ్నలన్నీ ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం లేదా సంఖ్య లేదా గుర్తు ఆ విధంగా మాత్రమే ఉంటాయి.

1. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?



ఎ) 6 బి) 4 సి) 5 డి) 3


సమాధానం: (సి)

వివరణ: ఇచ్చిన పాచికల స్థితులను గమనిస్తే
మొదటి డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 3, 4 అంకెలు
నాలుగో డయాగ్రమ్‌లో 2కు పక్కగా 1, 6 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 2కు పక్కగా 1, 3, 4, 6 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '2'కు పక్కగా '5' అంకె కనిపించడం లేదు. కాబట్టి 2 అనే అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె '5' అవుతుంది. కాబట్టి సమాధానం (సి) అవుతుంది.

పాచికలు

పోటీ పరీక్షల ప్రత్యేకం

2. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 6 అనే అంకె గల ముఖభాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అంకె ఏది?




ఎ) 4 బి) 2 సి) 1 డి) 5

సమాధానం: (ఎ)

వివరణ: ఇచ్చిన పాచిక స్థితులను గమనిస్తే మొదటి డయాగ్రమ్‌లో 6కు పక్కగా 1, 3 అంకెలు
రెండో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 3 అంకెలు
మూడో డయాగ్రమ్‌లో 6కు పక్కగా 5, 2 అంకెలు కనిపిస్తున్నాయి. అనగా 6కు పక్కగా 1, 2, 3, 5 అంకెలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ '6'కు పక్కగా 4 అంకె కనిపించడం లేదు. కాబట్టి 6 అంకె గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖ భాగంలో గల అంకె '4' అవుతుంది. కాబట్టి సమాధానం(ఎ) అవుతుంది.

3. కింది ఇచ్చిన పాచిక వివిధ స్థితుల ఆధారంగా 'Q' అనే అక్షరం గల ముఖ భాగానికి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం ఏది?



ఎ) T బి) U సి) R డి) S

సమాధానం: (డి)

వివరణ: ఇటువంటి ప్రశ్నల్లో ముందుగా ఇచ్చిన ఆరు అక్షరాలు పరిశీలించాలి.

ఈ ప్రశ్నలో ఇచ్చిన ఆరు అక్షరాలు P, Q, R, S, T, U పై డయాగ్రమ్‌లలో మూడో డయాగ్రమ్‌లో మాత్రమే 'Q' ఉంది. Qకు పక్కగా గల అక్షరాలు P, R. అనగా Uకు ఎదురుగా ఉండే ముఖభాగంలో S, T, Uల్లో కచ్చితంగా ఏ అక్షరం ఉంటుందో తెలియడంలేదు. ఇలాంటి సందర్భాల్లో అడిగినటువంటి అక్షరం గల పాచిక వదిలివేసి మిగిలిన పాచికల్లో కామన్ లెటర్ ఉంటే ఆ అక్షరమే సమాధానం అవుతుంది. దానిని మరింత వివరంగా తెలుసుకుందాం. ఈ ప్రశ్నలో Q అనే అక్షరం గల మూడో పాచికను వదిలివేసి మిగిలిన 1, 2, 4 పాచికల్లో S అనేది కామన్ లెటర్ ఇప్పుడు 'S'ని పరిశీలిస్తే
మొదటి డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, T అక్షరాలు
రెండో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా P, R అక్షరాలు
నాలుగో డయాగ్రమ్‌లో 'S'కు పక్కగా U, R అక్షరాలు కనిపిస్తున్నాయి. అనగా 'S'కు పక్కగా P, R, R, U అక్షరాలు కనిపిస్తున్నాయి. పాచికకు ఆరు ముఖభాగాలు ఉన్నాయి. ఇక్కడ 'S'కు పక్కగా 'Q' అక్షరం కనిపించడం లేదు. అనగా 'S'కి ఎదురుగా ఉండే ముఖభాగంలో గల అక్షరం 'Q' అని అర్థం. (అనగా Q అండ్ S లుఆపోజిట్ సైడ్స్) కాబట్టి సమాధానం (డి) అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దేవరగట్టు.. తలలు పగిలేట్టు



దేవరగట్టుపై కర్రల సమరం సాగిస్తున్న భక్తులు

- ఉత్సవమూర్తుల కోసం హోరాహోరీగా కర్రల సమరం
- 80 మందికిపైగా గాయాలు... కొందరికి పగిలిన తలలు
- కర్నూలు జిల్లాలో అనాదిగా వస్తున్న ఆచారం

ఆలూరు, అక్టోబరు 13: కర్నూలు జిల్లా హొళగుంద మండలం దేవరగట్టు మాళ మల్లేశ్వర స్వామి ఆలయంలో శనివారం విజయదశమి రోజున అర్ధరాత్రి బన్ని (కర్రల సమరం) హోరాహోరీగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. ఒళ్లు గగుర్పొడిచేలా సాగిన ఈ పోరాటంలో పదుల సంఖ్యలో భక్తులు గాయాల పాలయ్యారు. మరికొంత మంది తలలు పగిలాయి. శనివారం అర్ధరాత్రి నెరణికి, నెరణికి తండా.. కొత్తపేట, అరికెర గ్రామాల భక్తులు ఇనుప రింగులు తొడిగిన కర్రలతో సమరానికి బయల్దేరారు. చేతిలో అగ్ని దివిటీలతో 'డిర్ర్.. గో పరాక్..' అంటూ కేకలు వేస్తూ ఉత్సవమూర్తులను దక్కించుకునే సమయంలో పోటీ పడ్డారు. ఎప్పటిలాగే నెరణికి గ్రామస్థులే ఉత్సవ మూర్తులను దక్కించుకుని తమ గ్రామానికి తీసుకెళ్లే సమయంలో కొత్తపేట, అరికెర, నెరణికి తండాలకు చెందిన భక్తులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కర్రలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. ఈ సమరంలో 80మందికి పైగా గాయాలపాలయ్యారు. వారికి పసుపు పూసి చికిత్స నిమిత్తం ఆలూరు, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కర్రలతో దాడులను నివారించేందుకు పోలీసులు వారం ముందునుంచే అవగాహన కల్పిస్తూ వచ్చారు.

బైక్ అదుపు తప్పి ముగ్గురు మృతి

దేవరగట్టు ఉత్సవానికి వస్తుండగా ఘటన

ఆలూరు, అక్టోబరు 13 : దేవరగట్టు బన్ని ఉత్సవాలను వీక్షించేందుకు వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా తగ్గి నబుదిహాల్ గ్రామనికి చెందిన హరీష్(22), మల్లికార్జున (26), రవి కుమార్ (27) ముగ్గురూ ఒకే బైక్‌పై దేవరగట్టు ఉత్సవాలను వీక్షించేందుకు హొళగుందకు బయల్దేరారు. హొళగుంద మండలం అరికెర క్రాస్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పింది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. యువకులు బళ్లారి జిల్లా కరేకల్లు జిందాల్ ఫ్యాక్టరీలో దినకూలీలుగా పనిచేస్తున్నారు.



హరీష్, మల్లికార్జున రవి కుమార్

తిరుమలలో వైభవంగా చక్రస్నానం



చక్రత్తాళ్వారును పుష్కరిణిలోకి తీసుకొస్తున్న అర్చకులు

- ధ్వజావరోహణంతో ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు
- వాహన సేవలను వీక్షించిన 15 లక్షల మంది భక్తులు : టీటీడీ ఈవో

తిరుమల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన చక్రస్నానం శనివారం వైభవంగా జరిగింది. 9 రోజుల పాటు వైభవంగా నిర్వహించిన బ్రహ్మోత్సవాలకు చక్రస్నానం, ధ్వజావరోహణంతో టీటీడీ ముగింపు పలికింది. ముందుగా తెల్లవారుజామున 3 నుంచి 6గంటల వరకు స్వామి కి పల్లకీ ఉత్సవం, ఉదయం 6నుంచి 9గంటల మధ్యలో శ్రీభూవరాహస్వామి ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామికి, సుదర్శన చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా నిర్వహించారు. తర్వాత సుదర్శన చక్రాన్ని పవిత్ర పుష్కరిణి జలంలో మునక వేయించగా, భక్తులు కూడా అదే సమయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇక, శనివారం సాయంత్రం ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ధ్వజావరోహణాన్ని ఆగమోక్తంగా నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. సాధారణంగా చక్రస్నానం అనంతరం తిరుమలలో పూర్తిగా రద్దీ తగ్గిపోతుంది. అయితే పెరటాసి మాసం చివరి శనివారం కావడంతో శని, ఆదివారాలు కూడా భక్తుల రద్దీ కొనసాగింది. ధ్వజావరోహణం ముందు మాడవీధుల్లో నిర్వహించిన తిరుచ్చి వాహనసేవలోనూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. కాగా, చక్రస్నానంలో టీటీడీ ఉన్నతాధికారులతో పాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరి పాల్గొన్నారు. ఉదయం వీరు ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.

విజయవంతంగా బ్రహ్మోత్సవాలు: టీటీడీ ఈవో

సామాన్య భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా శ్రీవారి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించినట్లు టీటీడీ ఈవో శ్యామల రావు సంతోషం వ్యక్తం చేశారు. టీటీడీ చేపట్టిన ఏర్పాట్లపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో మొత్తం 6 లక్షల మంది మూలవిరాట్టును దర్శించుకోగా, దాదాపు 15 లక్షల మంది శ్రీవారి వాహన సేవలను వీక్షించారని చెప్పారు. ప్రత్యేకించి గరుడసేవలో దాదాపు 3.5 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్టు తెలిపారు.

శ్రీవారికి సీఎం పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్టు

- విజిలెన్స్ ఫిర్యాదుతో కేసు నమోదు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణపై వ్యంగ్యంగా పోస్ట్ చేసిన వ్యవహారంపై టీటీడీ సీరియస్ అయింది. విజిలెన్స్ వింగ్ ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజైన ఈ నెల 4న చంద్రబాబు.. శ్రీవారికి సమర్పించే పట్టువస్త్రాలు తలపై పెట్టుకుని ధ్వజస్తంభానికి మొక్కుతున్న వీడియో స్ర్కీన్ షార్ట్‌ను చైతన్య అనే వ్యక్తి 'బ్లైండ్ మన్' అనే ఎక్స్ పేజ్‌లో పోస్టు చేశారు. దానికింద 'దేవుడికి ఇష్టం లేదు అని స్పష్టంగా కనిపిస్తుంది. మళ్లీ చెప్తున్నా ప్రాణగండం ఉంది' అంటూ నవ్వుతున్న రెండు ఎమోజీలను జత చేశారు. ఈ వ్యవహారంపై టీటీడీ విజిలెన్స్ విభాగం ఏవీఎస్వో పద్మనాభం ఫిర్యాదు చేశారు. చైతన్యతో పాటు సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

పోటెత్తిన ఇంద్రకీలాద్రి





శనివారం బెజవాడ దుర్గమ్మ దర్శనం కోసం తరలి వచ్చిన భవానీ దీక్షాధారులు; (ఇన్‌సెట్) రాజరాజేశ్వరీ రూపంలో దుర్గమ్మ

- విజయదశమికి భారీగా తరలివచ్చిన భక్తులు
- మూలా నక్షత్రం రోజు కంటే ఎక్కువగా రాక
- ఒక్కరోజే సుమారు 2 లక్షల మందికి దర్శనం
- కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారం రద్దు
- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

విజయవాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శనివారం ముగిశాయి. పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలికారు. శ్రీరాజరాజేశ్వరీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. శనివారం సాయంత్రం పార్వతి, గంగ సమేత మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు నగరోత్సవం నిర్వహించారు. అనంతరం కనకదుర్గానగర్ మీదుగా దుర్గాఘాట్‌కు తీసుకొచ్చి హంస వాహనంపై ఉంచి పూజలు చేశారు. కృష్ణానదికి ఇన్‌ఫ్లో కారణంగా నదీ విహారాన్ని రద్దు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పోలీసులకు అప్పగించారు. వారు దుర్గాఘాట్ నుంచి ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఇక్కడ శమీవృక్షం వద్ద ఉన్న ఆలయంలో శమీపూజ నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ అర్చకులకు అప్పగించారు. కాగా, విజయదశమి ఒక్కరోజే సుమారు 2లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఏడాది దశమి రోజు అంతకుమించి తరలివచ్చా రు. ఆలయానికి ఉన్న అన్ని వైపులా రహదారులు భక్తులతో నిండిపోయాయి. పోలీసులు అప్పటికప్పుడు అదనపు బందోబస్తును ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. తొలిసారిగా ఆక్టోపస్‌ను రంగంలోకి దింపారు. భక్తుల రాక వాస్తవ పరిస్థితిని తెలుసుకునేందుకు ఏడు డ్రోన్లను ఉపయోగించారు. ఉత్సవాల చరిత్రలోనే తొలిసారిగా దసరా రోజు, ఆ మర్నాడు హోల్డింగ్ పాయింట్లను ఉపయోగించాల్సి వచ్చింది. భక్తుల రద్దీ కారణంగా విజయదశమి రోజున అన్ని వీవీఐపీ, వీఐపీ దర్శనాలను రద్దు చేశారు. ఆదివారం కూడా రద్దీ కొనసాగింది.

అక్రమ నిర్మాణాలకు చిరునామా గ్రీన్ గ్రేస్

● ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్



పొన్నూరుటౌన్, అక్టోబరు 13: గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్లు అక్రమ నిర్మాణాలకు చిరునామాగా మారాయని పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆరోపించారు. శనివారం పొన్నూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ల నిర్మాణంలో నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డం పెటుకొన్ని అనేక అక్రమాలకు నిర్మాణదారులు పాల్పడ్డారని ఆరోపించారు. అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేస్తూ వినియోగదారుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి మోసం చేశారని ధ్వజమెత్తారు. అంబటి మురళీకృష్ణకు ఈ అక్రమాలు తెలిసే మోసగించారని దుయ్యబట్టారు. స్వయంగా అంబటి మురళీకృష్ణ జి + 4 నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయని వెల్లడించటమే మిగిలిన నిర్మాణాలకు అనుమతులు లేవని స్పష్టమౌతుందన్నారు. రైల్వే ఎన్వోసీ లేకపోయినా నిర్మాణాలు చేపట్టడం అక్రమం కాదా అని ప్రశ్నించారు. నిర్మాణ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉందని చెబుతున్న అంబటి మురళీకృష్ణ అనుమతులు లేకుండా ఎలా నిర్మాణాలు చేపట్టారని నిలదీశారు. ఎన్నికల సమయంలో తనపై అనేకసార్లు అభూత కల్పనలతో అసత్య ప్రచారాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ కక్ష సాధింపులకు పొన్నూరులో తావులేదన్నారు. కానీ తనపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని గుర్తు చేసుకున్నారు. ఎన్నికల సమయంలో తనను తిరిగి జైలుకు పంపుతామని అంబటి మురళీకృష్ణ ప్రచార వేదికలపై ప్రకటించి బెదిరింపులకు పాల్పడింది నిజం కాదా అన్ని ప్రశ్నించారు. కానీ తాను మాత్రం వినియోదారుల శ్రేయస్సే లక్ష్యంగా గ్రీన్ గ్రేస్ అపార్ట్మెంట్ అక్రమ నిర్మాణాలపై పోరాడుతున్నట్లు ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

బగళాముఖి అమ్మవారికి ఎంపీ దంపతుల ప్రత్యేక పూజలు



ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులను సత్కరిస్తున్న ఫెస్టివల్ అధికారి నరసింహామూర్తి

పిట్టలవానిపాలెం, అక్టోబరు 13: పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామంలోని బగళాముఖి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పూర్ణాహుతి కార్యక్రమానికి పల్నాడు జిల్లా నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణ కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఆలయ చీఫ్ ఫెస్టివల్ అధికారి జి.నరసింహమూర్తి వారికి హోమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి దుశ్శాలువా, అమ్మవారి చిత్రపటాలతో ఘనంగా సత్కరించారు. తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు దంపతులకు బగళాముఖి అమ్మవారి ఆలయ విశిష్టతను నాగేశ్వరరావు, నరసింహమూర్తి తెలియజేశారు.

రైళ్లు కిటకిట

● దసరా సెలవులు ముగియడంతో వేల మంది తిరుగు ప్రయాణం
● టిక్కెట్‌లు కన్‌ఫర్మ్ కాక ఫుట్‌బోర్డు వద్ద వేలాడుతూ జర్నీ
● ప్రీమియం తత్కాల్‌లోనూ బుకింగ్స్ ఫుల్



లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చిన సమయంలో ప్రయాణికుల రద్దీ

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ సెలవులు ముగియడంతో వేరే ఊళ్ల నుంచి వచ్చిన వారంతా ఆదివారం మధ్యాహ్నం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో గుంటూరు రైల్వేజంక్షన్ మీదగా సికింద్రాబాద్, బెంగళూరు, చెన్నై, తిరువనంతపురం, విశాఖపట్నం, భువనేశ్వర్, హౌరా వెళ్లే రైళ్లన్నీ రద్దీగా మారాయి. వెయిటింగ్ లిస్టులు క్లియర్ కాకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రయాణికులు చాలామంది రైలు బోగీల ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రమాదకరరీతిలో బయలుదేరి వెళ్లారు. ముఖ్యంగా ఆదివారం సాయంత్రం విజయవాడ - లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ గుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చినప్పుడు కిక్కిరిసిపోయింది. ఆ రైలులో అప్పటికే విజయవాడ, మంగళగిరిలో ఎక్కిన ప్రయాణికులతో బోగీలన్నీ నిండిపోగా ఇక్కడ వేలమంది ఎక్కడంతో కిటకిటలాడింది. మిగతా రైళ్లలోనూ ఇదే పరిస్థితి కనిపించింది.

ఎక్కువ ఛార్జీలు పెట్టి బుకింగ్..

దసర సందర్భంగా విద్యార్థులకు 10 రోజులు సెలవులు వచ్చాయి. ఉద్యోగులకు అయితే మూడు రోజులు సెలవులు(ఆదివారంతో కలుపుకొని) ప్రభుత్వం ఇచ్చింది. దీంతో ఇతర రాష్ట్రాల్లో విద్య, ఉద్యోగ, ఉపాధి రీత్యా ఉంటున్న వారంతా దసర పండగని సొంత ఊరిలో కుటుంబ సభ్యుల మధ్యన ఆనందంగా జరుపుకునేందుకు తరలివచ్చారు. పండగ శనివారం ముగిసింది. అయితే మాంసాహార వంటకాలను ఆదివారం ఆరగించి మధ్యాహ్నం 2 గంటల తర్వాత తిరుగు ప్రయాణమయ్యారు. సికింద్రాబాద్ వైపునకు విశాఖపట్నం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌తో రద్దీ మొదలైంది. ఆ తర్వాత వరుసగా నాగర్‌సోల్, నాందేడ్, సంత్రగచి స్పెషల్, నాగర్‌కోయిల్ - కాచీగూడ, ఇంటర్‌సిటీ (వయా వరంగల్), లింగంపల్లి ఇంటర్‌సిటీ, వందేభారత్ రైళ్లు బయలుదేరి వెళ్లాయి. ఇవికాక రాత్రి నరసపూర్, చెన్నై, నారయణాద్రి, డెల్టా, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం స్పెషల్ రైళ్లు కూడా సికింద్రాబాద్‌కు వెళ్లాయి. వీటిల్లో ఏ ఒక్క దానిలోనూ రిజర్వుడ్ టిక్కెట్‌లు ఖాళీ లేవు. ప్రీమియం తత్కాల్ టిక్కెట్లను రెట్టింపు కంటే ఎక్కువ ఛార్జీలు పెట్టి బుకింగ్ చేసుకున్నారు.

ఒక్కటన్నా ప్రత్యేక రైలు ఉంటే..

మరోవైపు బెంగళూరు మార్గంలో రైళ్లు కూడా కిక్కిరిశాయి. ప్రశాంతి, హంబ్లీ, వాస్కోడిగామ, ధర్మవరం తదితర రైళ్లలోనూ వేల మంది ప్రయాణం చేశారు. ఇక సికింద్రాబాద్ నుంచి తిరువనంతపురంకు బయలుదేరి గుంటూరుకు వచ్చిన శబరి ఎక్స్‌ప్రెస్‌లో అడుగు తీసి అడుగు వేయడానికి ఖాళీ లేనంత రద్దీ తలెత్తింది. విశాఖపట్నంకు ఆదివారం మధ్యాహ్నం వెళ్లిన ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లోనూ ఖాళీలు లేకుండా ఏసీ సీట్లు అన్ని బుకింగ్ అయ్యాయి. రైల్వే శాఖ కొన్ని ప్రత్యేక రైళ్లను వేరే ప్రాంతాలకు ఏర్పాటు చేసి గుంటూరు మీదగా నడిపింది. దానివలన ఇక్కడి ప్రయాణికులకు పెద్దగా ఉపయోగం లేకుండా పోయింది. కనీసం ఒక్కటన్నా ప్రత్యేక రైలు గుంటూరు నుంచి సికింద్రాబాద్/బెంగళూరుకు ఏర్పాటు చేసి ఉంటే ప్రయాణికులకు మేలు జరిగేదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

ఉత్తమ ప్రదర్శనలుగా స్వేచ్ఛ నాటకం, చిగురుమేఘం నాటిక



ప్రముఖ రంగస్థల నటుడు గోపాలరావును సుబ్రహ్మణ్య శాస్త్రి పురస్కారంతో సత్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

తెనాలి అర్బన్, అక్టోబరు 13 : కళల కాణాచి, వేద గంగోత్రి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన నాటకోత్సవాల్లో చిగురుమేఘం సాంఘిక నాటిక, స్వేచ్ఛ నాటకం ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఈ నెల 7న ప్రారంభమైన నాటక, నాటికల పోటీలు శనివారం ముగిశాయి. చెరుకుమల్లి సింగారావు అధ్యక్షతన నిర్వహించిన ముగింపు సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు అందజేశారు. ప్రముఖ రంగస్థల పౌరాణిక నటుడు యడ్ల గోపాలరావును బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి రంగస్థల పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సాంఘిక నాటికల విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా చిగురుమేఘం, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నా శత్రువు, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా మతమా-మానవత్వమా బహుమతులు అందుకున్నాయి. ఉత్తమ దర్శకునిగా హరిబాబు, సహాయ నటునిగా రవిబాబు, రంగాలంకరణలో రామ్మోహన్, ఆహార్యంలో రమణరావు, సంగీతంలో సాయితేజ, రచనలో తామేశ్వరయ్య, హాస్యనటునిగా పండు, ప్రతినాయకునిగా మంజునాథ, క్యారెక్టర్ నటిగా జ్యోతిర్మయి, క్యారెక్టర్ నటునిగా కృష్ణమూర్తి, ఉత్తమ నటిగా సురభి లలిత, ఉత్తమ నటునిగా కావూరి సత్యనారాయణ బహుమతులు అందుకున్నారు. సాంఘిక నాటకాల విభాగంలో ఉత్తమ ప్రదర్శనగా స్వేచ్ఛ, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా మంత్రనగరి నాటకం బహుమతులు సాధించాయి. ఉత్తమ దర్శకునిగా డీఎం రెడ్డి, రంగాలంకరణలో దివాకర్ ఫణీంద్ర, ఆహార్యంలో థామస్, గాయకునిగా లీలా మోహన్, ఉత్తమ రచయితగా శివరామ్, సహాయ నటిగా మంజుభార్గవి, ప్రతినాయకునిగా రామారావు, క్యారెక్టర్ నటిగా కుసుమసాయి, నటునిగా బాలాజీనాయక్, ఉత్తమ నటిగా ప్రభావతి, నటునిగా గోవాడ వెంకట్ ఎంపికయ్యారు. విజేతలకు బుర్రా సాయిమాధవ్, ప్రవాస భారతీయుడు డాక్టర్ బాబు ఆర్ వడ్లమూడి, డబుల్ హార్స్ ఎండీ మునగాల శ్యాంప్రసాద్, వరప్రసాద్, జయలక్ష్మి, గరికపాటి సుబ్బారావు, ఆదినారాయణ, కె.సాంబశివరావు బహుమతులు అందజేశారు.

అవయవ దాన ఉద్యమం మరింత ముందుకు..



నియామక ఉత్తర్వులు అందుకుంటున్న రమణ యశస్వీ

గుంటూరు (మెడికల్) అక్టోబరు 13: ఆంధ్రప్రదేశ్ శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ రమణ యశస్వీ బాధ్యతలు స్వీకరించారు. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు, సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యుడుగా, కవిగా, రచయితగా, చిత్రకారుడుగా, వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులుగా వైద్య, సాహిత్య, సేవా రంగాల్లో తనదైన ముద్ర వేసిన డాక్టర్ రమణ యశస్వి ఆయా రంగాల్లో వందకుపైగా అవార్డులు అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో శరీర, అవయవదానం ఉద్యమం మరింత ముందుకు వెళ్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ శరీర, అవయవదానం పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెంచేందుకు పెద్దఎత్తున సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం సంఘం నూతన అధ్యక్షుడుగా నియమితులైన డాక్టర్ రమణ యశస్విని ఛైర్‌పర్సన్ గూడూరు సీతా మహాలక్ష్మి శాలువాతో సత్కరించారు.

వైసీపీ అరాచక శక్తుల ఆగడాలపై చర్యలు తీసుకోవాలి

● రెండు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష



గుంటూరులో ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కోపూరి లక్ష్మి, తెలుగు మహిళలు

గుంటూరు, అక్టోబరు 13: గత వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, ఆగడాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గుంటూరుకు చెందిన ఆదర్శ మహిళా మండలి అధ్యక్షురాలు కోపూరి లక్ష్మి స్వీయ గృహ నిర్బంధ నిరవధిక నిరాహార దీక్షకు దిగారు. విజయదశమి పండగ రోజున ప్రారంభించిన నిరవధిక నిరాహార దీక్ష రెండో రోజుకు చేరుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులు, ప్రతిపక్షాలపై దాడులు, అఘాయిత్యాలు, భూకబ్జాలు, అక్రమ కేసులు వంటి అరాచకాలను నిరసిస్తూ ఆమె గత ఎన్నికలకు ముందు ఏప్రిల్ 20న దేశ రాజధాని ఢిల్లీలో బొటనవేలు నరుక్కొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సాహస నిరసన కార్యక్రమం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో నాటి వైసీపీ అరాచకాలపై చర్యలు తీసుకుంటారని ఆమె భావించారు. అయితే నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆమె ఇటీవల సీఎం చంద్రబాబును స్వయంగా కలసి వైసీపీ అరాచకాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను నివాసం ఉంటున్న గుంటూరు రూరల్ మండలంలోని కృష్ణతులసి నగర్ తోపాటు స్వర్ణభారతి నగర్, స్వర్ణాంధ్ర నగర్, జన్మభూమి నగర్ తదితర ప్రాంతాల్లో వైసీపీ నాయకులు, రౌడీలు గత ఐదేళ్లలో అరాచకాలు, అఘాయిత్యాలు, భూకబ్జాలకు పాల్పడ్డారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూడా వారి ఆగడాలు తగ్గలేదని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆమె చంద్రబాబుకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిని మనసులో పెట్టుకున్న వైసీపీ వర్గీయులు, రౌడీషీటర్లు వివిధ కేసుల్లో పాత నేరస్తులు తమపై హత్యాయత్నానికి పాల్పడ్డారని ఆమె పేర్కొన్నారు. వీటన్నింటిపై విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో తాను ప్రాణ త్యాగానికైనా సిద్ధమేనని ఆమె ప్రకటించారు. పలువురు టీడీపీ మహిళలు మద్దతు ప్రకటించి దీక్షలో కూర్చున్నారు.

ముగిసిన మంగళగిరి కబడ్డీ లీగ్ పోటీలు

● పురుషుల విజేత తూర్పు గోదావరి జట్టు
● మహిళల విజేత విజయనగరం జట్టు



విజేతగా నిలిచిన విజయనగరం మహిళల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 13: రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో నిర్వహించిన మంగళగిరి కబడ్డీ లీగ్-2024 పోటీలు విజయవంతంగా ముగిశాయి. మంగళగిరి బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన గల మైదానంలో ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట నిర్వహించిన పోటీలు నాలుగు రోజులపాటు క్రీడాభిమానులను అలరించాయి. పురుషులు, మహిళలకు వేర్వేరుగా జరిగిన ఈ లీగ్‌లో ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగాయి. పురుషుల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై తూర్పు గోదావరి జట్టు 15-18 పాయింట్ల తేడాతో గెలుపొందింది. కృష్ణా జట్టు ద్వితీయ స్థానం, గుంటూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. మహిళల విభాగం ఫైనల్ మ్యాచ్‌లో కృష్ణా జట్టుపై విజయనగరం జట్టు 8-31 పాయింట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కృష్ణా జట్టు ద్వితీయ స్థానం, చిత్తూరు జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ట్రోఫీలు, నగదు బహుమతులను అందజేశారు.

బహుమతులు అందజేత

మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కబడ్డీ పోటీలకు ఈవెంట్ స్పాన్సర్‌గా మురళీకృష్ణ యార్లగడ్డ (మార్కోరేస్) వ్యవహరించారు. పురుషుల విభాగంలో విజేతగా నిలిచిన తూర్పు గోదావరి జట్టుకు జవ్వాది కిరణ్‌చంద్ రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టుకు నందం అబద్దయ్య రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన గుంటూరు జట్టుకు గద్దె శ్రీనివాసరావు, జంపాల సుబ్బారావు రూ.50 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. మహిళల విభాగంలో విజేతగా నిలిచిన విజయనగరం జట్టుకు ఆవల రవికిరణ్ రూ.లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన కృష్ణా జట్టుకు గాజుల శ్రీనివాసరావు రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన చిత్తూరు జట్టుకు గూడూరు వెంకట్రావు సహకారంతో రూ.50 వేల నగదు బహుమతులను అందజేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్ సహకారంతో ప్రతిరోజు సాయంత్రం అల్పాహారం అందజేశారు. బహుమతి ప్రదానోత్సవంలో ఏపీ పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రీడలకు కూటమి ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యం, ప్రోత్సాహాన్ని అందిస్తుందని అన్నారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించాలన్న లక్ష్యంతో మంత్రి నారా లోకేశ్ ప్రతిఏటా వివిధ రకాల టోర్నమెంట్లు నిర్వహించడంతోపాటు తాడేపల్లి, మంగళగిరి ప్రాంతాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారని తెలిపారు. మంగళగిరిని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దడంతోపాటు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై క్రీడాకారులు రాణించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ యలమంచిలి శ్రీకాంత్‌ను, ఎంటీఎంసీ అధికారులు, పోలీసు సిబ్బంది, క్రీడా మైదానాన్ని ఇచ్చిన బీఎండబ్ల్యూ యాజమాన్యాన్ని అభినందించారు.

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన సాదియా

● కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం కైవసం



పతకాలతో సాదియా అల్‌మాస్

మంగళగిరి సిటీ, అక్టోబరు 13: అంతర్జాతీయ వేదికపై మంగళగిరికి చెందిన పవర్ లిఫ్టర్ సాదియా అల్‌మాస్ మరోమారు సత్తా చాటారు. ఈ నెల 4 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలోని సన్‌సిటీలో జరిగిన కామన్వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. సాదియా అల్‌మాస్ 57 కిలోల జూనియర్స్ విభాగం స్క్వాట్‌లో 185 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, బెంచ్‌ప్రెస్‌లో 95 కిలోల బరువును ఎత్తి స్వర్ణం, డెడ్‌లిఫ్ట్‌లో 180 కిలోల బరువును ఎత్తి స్వర్ణం సాధించడంతోపాటు ఓవరాల్‌గా 460 కిలోల బరువును ఎత్తి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. కామన్వెల్త్ జూనియర్స్ 57 కిలోల విభాగంలో ఈ ఘనత సాధించిన గుంటూరు జిల్లా లిఫ్టర్‌గా సాదియా చరిత్ర సృష్టించారు. పతకాలు సాధించిన సాదియా అల్‌మాస్‌ను రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, ఏపీ అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సందాని తదితరులు సాదియాకు అభినందనలు తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించే వారికే మద్దతు



షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, అక్టోబరు 13: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వారికే పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో తాము మద్దతు నిస్తామని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ అన్నారు. ఆదివారం ఆయన గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతం అవుతున్నారని అన్నారు. సచివాలయ ఉద్యోగుల గొంతుకను శాసనమండలిలో వినిపించే అభ్యర్థికి మాత్రమే సచివాలయ ఉద్యోగులు అండగా ఉంటామని తెలిపారు. పట్టభద్రుల స్థానానికి ఎన్నికలు జరిగే జిల్లాల్లో సుమారు 40 వేల మందికిపైగా సచివాలయ ఉద్యోగులు గ్రాడ్యుయేట్లుగా ఉన్నారని, వీరందరూ ఓటు కు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, గుంటూరు, కృష్ణ జిల్లాల్లో జరగబోవు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల కొరకు ఆయా జిల్లాల్లోని పట్టభద్రులు, సచివాలయ ఉద్యోగులు ఫామ్ 18 దరఖాస్తు ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని అబ్దుల్ రజాక్ సూచించారు.

సూర్యలంక తీరానికి పోటెత్తిన పర్యాటకులు



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలను ఆచరిస్తున్న పర్యాటకులు

బాపట్ల రూరల్, అక్టోబరు 13: దసరా సెలవుల్లో ఆఖరిరోజు ఆదివారం కావటంతో బాపట్ల మండలం సూర్యలంక సముద్ర తీరానికి పర్యాటకులు పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పర్యాటకులు సూర్యలంక సముద్ర తీరానికి అధిక సంఖ్యలో వచ్చారు. యువకులు తీరంలో కేరింతలు కొడుతూ సముద్ర స్నానాలు చేయగా, చిన్నారులు తీరం ఒడ్డున ఇసుక తిమ్మెలతో ఆడుకుంటూ ఆహ్లాదకరంగా గడిపారు. పర్యాటకులు కుటుంబ సమేతంగా సముద్ర స్నానాలు ఆచరించిన అనంతరం తీరం సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద, తోటలు కింద వనభోజనాలు చేస్తూ సంతోషంగా గడిపారు. తీరం ఒడ్డున ఎటువంటి ఘటనలు జరగకుండా బాపట్ల రూరల్, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు గస్తీని నిర్వహించారు.

నందిగం అనుచరులు అరెస్టు.. విడుదల

తుళ్లూరు, అక్టోబరు 13: ఎన్నికల కౌంటింగ్ రోజు కూటమి ప్రభుత్వం గెలిచిందని ఉద్దండ్రాయుపాలెంకు చెందిన దళిత జేఏసీ నేత పులి చిన్నా(మరియదాసు)సంబరాలు చేస్తుంటే అతనిపై మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది అనుచరులు దాడి చేశారు. ఘటనపై ఈ ఏడాది జూలై 8న తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో బాధితుడు చిన్నా నందిగం ప్రధాన నిందితుడిగా అనుచరులపై ఫిర్యాదు చేశారు. అప్పటి తుళ్లూరు సీఐ సుభాని నందింగంతోపాటు అనుచరులపై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం ఒక మర్డర్ కేసులో గుంటూరు జిల్లా జైలులో నందిగం సురేశ్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. పులి చిన్నా కేసు దర్యాప్తులో భాగంగా శనివారం నందిగం అనుచరులు ఐదుగురిని అరెస్టు చేసి స్టేషన్ బెయిల్‌పై విడుదల చేశారు. తనపై హత్యాయత్నం చేసిన వారిపై చిన్న కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇవ్వడం ఏమిటని బాధితుడు పులి చిన్నా ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

సత్తెనపల్లి, అక్టోబరు 13: రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి చెందిన సంఘటన సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడులో ఆదివారం జరిగింది. లక్కరాజుగార్లపాడు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ కోటేశ్వరరావు కుమార్తె కావ్య(14) తన పెద్దమ్మ కుమారుడైన మీసాల వంశీతో కలసి స్కూటీపై ఫిరంగిపురం మండలం వెళ్తుండగా లక్కరాజుగార్లపాడు గ్రామం దాటగానే స్కూటీని ట్రాక్టర్ ఢీకుంది. దీంతో తీవ్ర గాయాలైన కావ్యను, వంశీని చికిత్స నిమిత్తం బంధువులు, కుటుంబ సభ్యులు సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే కావ్య మృతి చెందింది. వంశీకి తీవ్ర గాయాలు కావటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కావ్య తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో ఈతకి దిగి కూలీ మృతి

తుళ్లూరు అక్టోబర్ 13: చెరువులో దూకి వలన కూలీ మృతి చెందిన ఘటన మండల కేంద్రం తుళ్లూరులో శనివారం సాయంత్రం జరిగింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ అలియాస్ రాజు(39) పదేళ్లగా తుళ్లూరులో తాపీ వర్కర్‌గా పని చేస్తున్నాడు. గత రెండేళ్ల నుంచి తుళ్లూరులోని ఐనచెరువుకి చెందిన రాంబాబు అనే మేస్త్రి ఇంట్లోనే ఉంటూ, అతని వద్దే పని చేస్తున్నాడు. శనివారం మద్యం మత్తులో చెరువులో ఈతకు దిగాడని స్థానికులు చెబుతున్నారు. ఈత వచ్చినప్పటికీ ఫుల్‌గా మద్యం తాగి ఉండటంతో మునిగిపోయాడు. అక్కడ వారు గమనించి చెరువులో గాలించారు. అయినా ప్రయోజనం కలగలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలించినా మృతుడి ఆచూకి లభ్యం కాలేదు. తెల్లవారిన తరువాత రామకృష్ణ మృతదేహం చెరువు మధ్యలో తేలింది. బంధువులకు మేస్త్రి రాంబాబు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుడి కాలువలో పడి వ్యక్తి మృతి

మాచర్ల రూరల్, అక్టోబరు 13: మద్యం మత్తులో కుడి కాలువలో పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. విజయపురిసౌత్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన గోగుల శివ శంకర్ జేసీబీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం సాయంత్రం స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనాలపై పైలాన్ వెళ్లి పూటుగా మద్యం తాగారు. తిరిగి వస్తూ ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న శివశంకర్ మార్గమధ్యలో వాహనం నడుపుతున్న వ్యక్తిపై వాంతులు చేసుకున్నాడు. వీరు దుస్తులు కడుక్కునేందుకు మండలంలోని తాళ్లపల్లి కుడి కాలువ వద్ద ఆగారు. కాలువలోకి దిగి దుస్తులు కడుక్కుంటుండగా శివశంకర్ మద్యం మత్తులో కాలువలో పడిపోయాడు. కాగా మృతదేహం ఆదివారం తాళ్లపల్లి బ్రిడ్జి వద్ద లభ్యమైంది. విజయపురిసౌత్ పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి బాబాయి శివ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 13 : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,516 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 30,225 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని తెలిపారు. వీటిలో 16 వేల క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా దిగువ కృష్ణకు వస్తున్నాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

సాగునీటి కాలువలపై వైసీపీ నిర్లక్ష్యం

● మరమ్మతులుకు రూ.2 కోట్లు విడుదల చేసిన కూటమి

రెంటచింతల, అక్టోబరు 13: వైసీసీ ఐదేళ్ల పాలనలో సాగు నీటి కాలువల మరమ్మతులను పూర్తిగా విస్మరించిందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. ఆదివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 12 మేజర్లు, మైనర్ కాల్వల మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రూ.2 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభమవుతాయని, ఆయా పనులను పర్యవేక్షించడానికి తాను స్వయంగా వస్తానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

16న అరుణాచలంకు ఆర్టీసీ బస్సు

సత్తెనపల్లి, అక్టోబరు 13 : ఈనెల 16వ తేదీ సాయంత్రం సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్ నుంచి అరుణాచలంకు బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ ఆదివారం విలేకరులకు తెలిపారు. 16వ తేదీ సత్తెనపల్లి బస్టాండ్ నుంచి బయలుదేరి 17వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందన్నారు. అక్కడ దర్శనం అనంతరం కంచికి వెళ్ళి అక్కడి నుంచి బయలుదేరి 18వ తేదీ సాయంత్రానికి సత్తెనపల్లి చేరుకుంటుందన్నారు. మనిషికి రాను పోను టిక్కెట్ చార్జ్ రూ.2 వేలు ఉంటుందని ఆయన తెలిపారు. సత్తెనపల్లి పరిసర ప్రాంతాల్లోని భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 9959225428 నెంబరులో సంప్రదించాలని కోరారు.



మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను పరామర్శిస్తున్న, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి సోదరుడి మృతి

నివాళులర్పించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, అక్టోబరు 13 : టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ సోదరుడు శ్రీనివాసరావు (57) అనారోగ్యంతో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఆయన సోదరుడు భాష్యం నవీన్, టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబ శివారెడ్డి, గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్‌ను కలసి పరామర్శించారు. శ్రీనివాసరావు అంతిమ యాత్రలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో డీజే వివాదం

● పోలీసులపై దాడి చేసేందుకు పలువురి గ్రామస్థుల యత్నం

బెల్లంకొండ, అక్టోబరు 13: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో పోలీసులపై కొందరు యువకులు దుర్భాషలాడి దాడికి ప్రయత్నించి ఘటన శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి బతకమ్మను ఆడేందుకు స్థానికులు డీజేను ఏర్పాటు చేసుకున్నారు. కొంత మంది యువకులు డీజేపై నీరు పోయటంతో అది పనిచేయటం ఆగిపోయింది. ఈవిషయంపై కొంత వివాదం చెలరేగడంతో స్థానికులు కొందరు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. డీజేపై ఉన్న ఓ యువకుడిని కిందకు దిగమని ఓ పోలీసు అధికారి గద్దించటంతో పక్కనే ఉన్న గ్రామస్తులు ఆయనపై మూకుమ్మడిగా దాడి చేసేందుకు ప్రయత్నించారు. అయితే జరిగిన ఘటనపై ఆ పోలీసు అధికారిని వివరణ కోరగా విషయం తెలపడానికి ఆయన నిరాకరించారు. ఈ ఘటనపై గ్రామస్థులు కొందరు 'పోలీసులకే రక్షణ లేకుండా పోయింది' అని చర్చించుకున్నారు.



తోపుడు బండ్లను అందిస్తున్న లక్ష్మీనారాయణ

నిరుపేదలకు తోపుడు బండ్లు అందజేత

గురజాలటౌన్, అక్టోబరు 13: మండలంలోని పులిపాడులో టీడీపీ నేతలు పలువురి పేదలకు తోపుడు బండ్లను అందజేశారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆర్థికంగా వెనుకబడిన నిరుపేదలకు అండగా నిలిచేందుకుగాను టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ సహకారంతో తోపుడు బండ్లను పంపిణీ చేసినట్లు టీడీపీ నేతలు తెలిపారు.



సర్పంచ్ సరస్వతి బాయి దంపతులను సన్మానిస్తున్న నేతలు

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా

● కారంపూడి సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన సరస్వతి బాయి

కారంపూడి, అక్టోబరు 13: కారంపూడి గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని సర్పంచ్ సరస్వతిబాయి అన్నారు. శనివారం ఆమె సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు సర్పంచ్ సరస్వతి బాయి దంపతులను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తనకు పదవి వచ్చేందుకు కృషిచేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పీ.అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్న లక్ష్మీనారాయణ, నేతలు పలువురు పాల్గొన్నారు.

కాలనీలో కనీస వసతులు కరవు

● సమస్యల నిలయంగా పాలువాయి జంక్షన్ ప్రాంతం
● గృహాల మధ్యన ముళ్ల చెట్లు.. పాములు సంచారం
● అంతర్గత రహదారులు డ్రెయినేజీ కాలువలు లేవు
● నేతలు, అధికారులు పట్టించుకోవాలని స్థానికుల విన్నపం



కాలనీలో అధ్వానంగా రహదారి

రెంటచింతల, అక్టోబరు 13: రెంటచింతల మండల పరిధిలోని పాలువాయి జంక్షన్ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. వీధి దీపాలు అన్ని వీధుల్లో లేవు. అంతర్గత రహదారులు (సీసీ రోడ్లు), డ్రెయినేజీ కాలువలు ఎక్కడా కనిపించవు. ఇళ్లపై నుంచే హైటెన్షన్ విద్యుత్ లైన్ తీగలు ఏర్పాటు చేశారు. ఇళ్ల చుట్టు ముళ్ల కంప చెట్లు దట్టంగా పెరిగి ఉన్నాయి. వర్షాకాలంలో ఇళ్లలోకి పురుగు పుట్ర వస్తున్నాయిని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇన్ని రకాల సమస్యల మధ్యన పాలువాయి జంక్షన్ కాలనీ వాసులు తమ జీవితాలను వెళ్లదీస్తున్నారు.

మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారికి ఎడమ వైపున 195/బీలో దేవుని మాణ్యం భూమి 18 ఎకరాలుంటే అందులో 6 ఎకరాలను సుమారు 19 సంవత్సరాల క్రితం ప్రభుత్వం పేదలకి ఒక్కో కుటుంబానికి రెండు సెంట్లు చొప్పున భూమిని నివేశన స్థలాలుగా కేటాయించింది. ఆ ప్రాంతంలో ప్రారంభంలో 193 కుటుంబాల వారు ఉండేవారు. అయితే ఆ కాలనీలో పాలకులు మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేయకపోవడంతో అక్కడ నివాసం వుండే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం అక్కడ కేవలం 25 కుటుంబాల వారు మాత్రమే నివాసం ఉంటున్నారు. వారుకూడా అనేక సమస్య లతో సమస్యలతో సతమవుతూ జీవిస్తున్నారు. గృహాల్లోని మురుగు నీరు బయటకు పోయే మార్గం లేదు. సైడ్ కాల్వలు లేవు. వీధి దీపాలు నామమాత్రంగా ఉన్నాయి. ఆ ప్రదేశమంతా ముళ్ల చెట్లతో నిండిపోయింది. సైడ్ కాలువలైనా నిర్మిస్తే మురుగు పారుదల ఉంటుంది. లేకుంటే దోమల దెబ్బకు తట్టుకోలేకపోతున్నారు. కరెంట్ తీగలు గృహాల మీదనే ఉన్నాయి. అంతర్గత రహదారులు నిర్మించి, మురుగు పారుదల సౌకర్యాన్ని కల్పిస్తే ఈ కాలనీలో నివాసం ఉండే వారి సంఖ్య పెరుగే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతు న్నారు. అధికారులు, పాలకులు ఆ వైపుగా చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి సమస్యలను వివరిస్తా



తమ పంచాయతీ పరిధిలోని జంక్షన్ కాలనీలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకెళ్తా. ప్రజలకు 2006 స్థలాలు ఇవ్వగా ఇప్పటికి చాలా మంది ఇళ్లను నిర్మించుకోలేదు. ఎమ్మెల్యే సహకారంతో లబ్ధిదారులకు ప్రభుత్వ పరంగా గృహాలు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తాము.

- సర్పంచ్ మందలపు విజయలక్ష్మి



కాలనీలో ఇళ్ల మధ్యన పెరిగిన ముళ్ల కంప



రామకోటమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

టీడీపీ నేత మాతృమూర్తి మృతి

● నివాళులర్పించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, అక్టోబరు 13: టీడీపీ సీనియర్ నేత సనగంటి సిద్దయ్య తల్లి రామకోటమ్మ (80)మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదివారం రెంటచింతల ఆంజనేయస్వామి మాన్యంలోని సిద్దయ ఇంటికి విచ్చేసి రామకోటమ్మ భౌతికకాయానికి నివాళులర్పించి సిద్దయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ అబ్బిరెడ్డి, పట్టణఅధ్యక్షుడు రాజారెడ్డి, మాజీ ఎంపీటీసీలు వై.రమేష్, రాజ్‌కుమార్, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బీ.రామకృష్ణ, రాయపరెడ్డి, ఇన్నారెడ్డి, మల్లయ్య, దానయ్య, గొట్టం మల్లారెడ్డి, మునినాయక్, వెల్దుర్తి మాజీ జడ్పీటీసీ కళ్లం రామాంజనేయరెడ్డి ఉన్నారు.

ప్రభుతాస్పత్రిలో వైద్యులను నియమించాలి

క్రోసూరు, అక్టోబరు13: పెదకూరపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తగినంత మంది వైద్యులు లేక వైద్యం కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే వైద్యులను నియమించాలని కోరుతూ ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేసినట్లు సీపీఎం నియోజకవర్గ నేతలు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆస్పత్రిలోని గైనకాలజిస్టు 11 నెలల క్రితం డిప్యూటేషన్‌పై వెళ్ళారని, 7 నెలల నుంచి జనరల్ సర్జన్, 4 నెలల నుంచి ఎనస్థీషియా వైద్యులు లేరని తెలిపారు. దీంతో వివిధ శస్త్ర చికిత్సల కోసం పెదకూరపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్ళే రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రిలో తగినంత మంది వైద్యులను నియమించాలని, ఆస్పత్రిని నూతన భవనంలోకి మార్చా లని ఎమ్మెల్యేని కోరినట్లు సీపీఎం నేతలు తెలిపారు.

ఆలయానికి వెండి పల్లకి వితరణ



ఆలయానికి అందజేసిన వెండి పల్లకి వద్ద పెద్ద వెంకట్రామయ్య దంపతులు

రెంటచింతల, అక్టోబరు 13: మండలంలోని మంచికల్లు గ్రామానికి చెందిన డి.పెద్ద వెంకట్రామయ్య సతీమణి దంపతులు సీతారామ స్వామి ఆలయానికి రూ.2 లక్షలు విలువ చేసే వెండి పల్లకిని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో నెవలి రామిరెడ్డి, లేళ్ల శ్రీనివాసరావు, అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు పాల్గొన్నారు.

నేడు పెదకూరపాడులో ప్రజా దర్బార్

పెదకూరపాడు, అక్టోబరు 13: నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో సోమవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు మండల టీడీపీ అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారని తెలిపారు.

నేడు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెదకూరపాడులో అంబేడ్కర్ సెంటర్‌నుంచి పాల కేంద్రం రూ.50 లక్షల నిధులతో నిర్మించే సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు అర్తిమళ్ళ రమేష్ తెలిపారు.

విద్య ద్వారానే అభివృద్ధి

పిడుగురాళ్ల, అక్టోబరు 13: విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ కౌన్సిల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఉడతా కోటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని లెనిన్‌నగర్ కార్డ్ స్కూల్లో కార్డ్ సంస్థ ఆధ్వర్యాన నిర్వహించిన బాలబాట ఆర్గనైజర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా బాలబాట డీవోలకు నెలవారీ ప్రొవిజన్‌ను కోటేశ్వరరావు పంపిణీ చేశారు. కార్డ్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ తాళ్లూరి అమరనాథ్ మాట్లాడుతూ కార్డ్ సంస్థ 24 ఏళ్లుగా బాలబాట ద్వారా విద్యాభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రభుత్వ న్యాయవాది రూత్ బనియన్, కార్డ్ సంస్థ జాయింట్ డైరెక్టర్ పుష్పలత, ఏసీవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

16న మహిళా జిల్లా జట్ల ఎంపికలు

సత్తెనపల్లి, అక్టోబరు 13: పల్నాడుజిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో 16వతేది నందిగామ జడ్పీ హైస్కూల్లో సీనియర్స్ పురుషుల, మహిళా జట్ల ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు.



కబడ్డీ పోటీల్లో విజేతలుగా నిలిచిన దాచేపల్లి ఎంఎల్‌టీ సీనియర్ జట్టు

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

దాచేపల్లి, అక్టోబరు 13: దసరా సందర్భంగా శనివారం దాచేపల్లిలోని బీసీ కాలనీలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యాన నిర్వహించిన కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలకు జిల్లా వ్యాప్తంగా 20 టీంలు హాజరయ్యాయి. దాచేపల్లికి చెందిన ఎంఎల్‌టి టీం మొదటి బహుమతి, గామాలపాడు టీం రెండవ, రెడ్డిగూడెం టీం మూడవ, దాచేపల్లి ఎంఎల్‌టి జూనియర్స్ జట్టు నాలుగో బహుమతి పొందాయి. కార్యక్రమంలో చికెన్ జానీబాషా, పగడాల భాస్కరరావు, తోట వెంకటేశ్వర్లు, మస్తాన్‌వలి మాష్టారు, జక్కుల వీరాస్వామి, గండె వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



నరసింగపాడులో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి సన్నిధిలో జడ్జి సురేష్‌బాబు

అమ్మవారికి జడ్జి సురేష్‌బాబు పూజలు

నకరికల్లు, అక్టోబరు 13: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం నరసింగపాడులో వేంచేసి ఉన్న అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామిని నల్గొండ జిల్లా దేవరకొండ జూనియర్ సివిల్ జడ్జి కేవీ హరీష్‌బాబు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీచైర్మన్ బిజ్జం కృష్ణారెడ్డి జడ్జి హరీష్ బాబును సన్మానించారు. ఆలయ అర్చక స్వామి కొమ్మవరపు అమరేశ్వర కుమార్ హరీష్ బాబుకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సంక్షోభంలో ఆటో రంగం

సత్తెనపల్లి, అక్టోబరు 13 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఆటో రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకు పోయిందని సీపీఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య అన్నారు. ఆదివారం సాయంత్రం సీఐటీయూ కార్యాలయంలో చేయూత ట్రాలీ ఆటోవర్కర్స్ యూనియన్ సత్తెనపల్లి డివిజన్ కమిటీ సమావేశాన్ని ఎస్ రాజేంద్రప్రసాదు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న చలమయ్య మాట్లాడుతూ ఆటో కార్మికులంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎం హరిపోతురాజు, వెంకట్, కొత్తపల్లి చిన మలయ్య, నాగేశ్వరరావు, ఇమ్మానియేలు, సాంబశివరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సత్తెనపల్లిలో ఎమ్మెల్యే కన్నా పర్యటన

సత్తెనపల్లి, అక్టోబరు 13 : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం సత్తెనపల్లి పట్టణంలో పర్యటిస్తారని టీడీపీ పట్టణ కార్యదర్శి నూర్ బాషా జానీ బాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కాకతీయ కళ్యాణ మండపంలో గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుతో కలసి ఓటర్ల నమోదు ప్రక్రియలో, సాయంత్రం 3 గంటలకు కట్టావారిపాలెం, కంటెపూడి, భీమవరం గ్రామాల్లో జరిగే పల్లె పండుగ వారోత్సవాల్లో పాల్గొంటారని తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పాత కక్షల నేపథ్యంలో కత్తితో దాడి



గాయ పడిన అశోక్ కుమార్

బెల్లంకొండ, అక్టోబరు 13 : పాత కక్షల నేపథ్యంలో కత్తి దాడి చేసిన సంఘటనలో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన గాలం అశోక్‌కుమార్‌కు గొంతువద్ద గాయం అయింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ కుమార్‌తో తులసీరావుకు గతంలో గొడవలు జరిగాయని, ఈ నేపథ్యంలో తులసీరావు శనివారం రాత్రిఅశోక్‌కుమార్ పై కత్తితో దాడిచేశాడు. గొంతుకు గాయమైన అశోక్ కుమార్‌ను స్థానికులు వెంటనే వైద్యశాలకు తరలించారు. అశోక్ కుమార్ బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహన దొంగ అరెస్టు

ముప్పాళ్ళ, అక్టోబరు 13 : మండలంలోని చాగంటివారిపాలెంలో ఈనెల 11న ద్విచక్ర వాహనాన్ని దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. చాగంటివారిపాలెంకు చెందిన టీ పిచ్చయ్య ఆంజనేయ స్వామి విగ్రహం ఎదురుగా తన ద్విచక్ర వాహనం ఉంచానని, దానిని గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపీని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

కోలాహలంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బెల్లంకొండ, అక్టోబరు 13: బెల్లంకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005 - 06 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. గెట్ టు గెదర్‌లో పాల్గొన్నారు. ఈ బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు మొత్తం 130 మంది హాజరయ్యారు. ఉపాధ్యాయులు అరుణ, మాధవి, మల్లికార్జునరెడ్డి, కోటేశ్వరరావు, గోపీ ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు.

పలువురికి జనసేన నేతల ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న సాంబశివరావు

పెదకూరపాడు, అక్టోబరు 13 : మండలంలోని 75 తాళ్ళూరు చెందిన యన్నం నరేష్, రామదాసు శ్రీనివాసరావులను ఆదివారం జనసేన నేతలు సుధాసాంబ శివరావు వారి గృహాలకు వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ఒక్కొక్కరికి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఆయనవెంట జనసేన నేతలు వెంకట చలపతిరావు, శౌరీలు, కందుల లక్ష్మీకాంత్ ఉన్నారు.

ముగిసిన దసరా వేడుకలు

● భక్తి శ్రద్ధలతో మహిళల పూజలు
● ఘనంగా బతుకమ్మల ఊరేగింపు
● పలు ప్రాంతాల్లో లడ్డూ ప్రసాదానికి వేలం
● అమ్మవారి విగ్రహాలకు నిమజ్జనం



అమరేశ్వరాలయంలో శమీవృక్షం వద్ద పూజలో పాల్గొన్న భక్తులు

అమరావతి, అక్టోబరు 13: శనివారం రాత్రి జరిగిన శమీపూజతో శ్రీదేవి శరన్నవరాత్ర మహోత్సవాలు ముగిశాయి. విజయదశమి పర్వదినం రోజున ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరేశ్వరాలయంలో స్వామివార్ల గ్రామోత్సవం అనంతరము శమీపూజ జరిగింది. భక్తుల సమక్షంలో వేదపండితులు, అర్చకులు జమ్మిచెట్టుకు ప్రదిక్షణలు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి విగ్రహాన్ని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.

ఆలయ సన్నిధిలో పిల్లి మాణిక్యరావు

ఏపీ లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు ఆదివారం అమరావతిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. అర్చకులు స్వామివారికి పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఈవో విశ్వనాథ్, సర్పంచ్ విఠల్‌రావు, టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: విజయదశమి సందర్భంగా ఆలయల్లో అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద కోలాట ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం బతుకమ్మలకు ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.

75 తాళ్ళూరు దసరా మహోత్సవాల్లో కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి కోనేటిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు.

క్రోసూరు : మండల కేంద్రంలోని 14 ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన బతకమ్మలను ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక వాహనాల్లో ఊరేగింపు జరిపి నిమజ్జనోత్సవాలకు తరలించారు. బతుకమ్మలు పీసపాడు, ఎర్రబాలెం, అందుకూరు, బయ్యవరం, కోనూరు గ్రామాల సమీపంలో ఉన్న వాగుల్లో నిమజ్జనాలు చేశారు. క్రోసూరు వాసవి అమ్మవారి దేవాలయంలో చివరి రోజు విజయ దశమి పర్వదినాన అమ్మవారు రాజ రాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శన మిచ్చారు.

అచ్చంపేట : అచ్చంపేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి పూజలు చేశారు. పూజారులు గుంటూరు బలరామాచార్యులు, సురేష్ కుమార్ ఆచార్యులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సూరె వీర వెంకట మణికంఠ, కోశాధికారి వెంకట సుబ్బారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రెంటచింతల: మండలంలోని రెంటాల, పశర్లపాడు గ్రామాల్లో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి పాల్గొన్నారు. పండుగ సందర్భంగా మహిళలకు చీరెలు పంపిణీ చేశారు.

పలు ఆయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం నిమిత్తం కృష్ణానదికి తరలించారు. రెంటచింతల వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో రూ.65 వేలకు ఏచూరి కిషోర్ దక్కించుకున్నట్లు ఆలయ చైర్మన్ కేవీ నాగేశ్వరరావు,దేవరశెట్టి వెంకట నర్సయ్యలు తెలిపారు.



గౌరీ దేవతకు హారతిని స్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి

కారంపూడి: పట్టణంలోని శరవణ రెసిడెన్సీ వద్ద బతుకమ్మలకు ప్రత్యేక పూజల చేసి, ఊరేగింపు నిర్వహిచారు. ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు కోలాటంలో పాల్గొన్నారు. అనంతరం కృష్ణానదిలో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద అమ్మవారి లడ్డు ప్రసాదంకు వేలం నిర్వహించగా దాచేపల్లికి చెందిన వందనపు రామాజినేయులు రూ. 1.20 లక్షలకు లడ్డు ప్రసాదంను సొంతం చేసుకున్నారు.

దుర్గి: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకొని శనివారం అంగరంగ వైభవంగా వేడుకలను నిర్వహించారు. చిన్నారుల కోలాట ప్రదర్శన అబ్బురపరిచింది. చిన్నా పెద్ద తేడా లేకుండా బతుకమ్మను నెత్తిన పెట్టుకొని గ్రామ పుర వీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగింపు జరిపారు. బతుకమ్మను కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ సుధీర్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.



సత్తెనపల్లిలో అమ్మవారి ఊరేగింపు దృశ్యం



గుండ్లపల్లిలో రాజరాజేశ్వరి దేవిగా బ్రమరాంభ అమ్మవారు

సత్తెనపల్లి : వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి మూలవిరాట్‌ను ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగించారు. వివిధ ప్రాంతాల్లో బతుకమ్మలను ఊరేగింపు చేసి అనంతరం నిమజ్జనం చేశారు.

నకరికల్లు : మండలంలోని దేవాలయాల్లో అమ్మవార్లు రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండ్లపల్లి లోని బ్రమరాంభ సమేత మల్లేశ్వర స్వామి, కుంకలగుంటలోని భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి, రూపెనగుంట్లలో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి, గంగా పార్వతి సమేత నీలకంఠేశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పిడుగురాళ్ల : పట్టణంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నాగుల గుడిలో 108 రకాల ఫల, పుష్పాలతో స్వామి వారికి అభిషేకాలు జరిగాయి. కనకదుర్గ అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని కేరళ వాయిద్యాలు, మేళతాళాలతో ఊరేగింపు చేశారు.

ముప్పాళ్ళ : మండలంలోని గోళ్ళపాడులో అక్రాన్ ఫార్మా కంపెనీలో నిర్వహించిన వేడుకల్లో అమ్మవారిని, బతకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపు నిర్వహించారు. కంపెనీలోని వహిళలు కోలాట ప్రదర్శనగా ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమంలో అక్రాన్ ఫార్మా కంపెనీ డైరెక్టర్ మారూరి సత్యనారాయణరెడ్డి, లీలావతి, కంపెనీ ప్లాంట్ హెడ్ రసూల్, అడ్మినిస్ట్రేషన్ అధికారి కే విమల రాజు, లీగల్ అడ్వయిజర్ దాడి వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండ : బెల్లంకొండ ఊరి శివారు జమ్మిచెట్టు వద్ద పూజారి పులుపుల వెంకట ఫణి కుమార్ శమీ పూజా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బెల్లంకొండ ఈవో వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో దేవాలయాల్లో ఉన్న ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

మాచర్లటౌన్ : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారి లడ్డు ప్రసాదానికి వేలం నిర్వహించగా టీడీపీ నేత కంభంపాటి అనిల్‌కుమార్ రూ. 45 వేలకు దక్కించుకున్నారు.

వెల్దుర్తి : మండలంలోని పట్లవీడు, శిరిగిరిపాడు, మండాది గ్రామాల్లో మహిళలు బతుకమ్మలను ఊరేగించి కోలాట ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.



పిడుగురాళ్లలో మేళతాళాలతో వాసవీ అమ్మవారి ఊరేగింపు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

నరసరావుపేటలో నూతన బస్సులు ప్రారంభం



ఆర్టీసీ నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13: నరసరావుపేట ఆర్టీసీ డిపోలో ఆదివారం రెండు కొత్త ఆర్టీసీ బస్సులను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని కొత్త బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న రోజులలో మరిన్ని కొత్త బస్సులు తీసుకొస్తామన్నారు. ప్రయాణికుల రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని, ఇబ్బందులు లేకుండా నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ, కూటమి నాయకులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న కార్మికులు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

● ఎంసీపీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి రెడ్‌బాషా

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13: తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఎంసీపీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి రెడ్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు దీక్ష చేస్తున్నారు. ఈ సందర్భంగా రెడ్ బాషా మాట్లాడుతూ నరసరావుపేట మున్సిపాలిటీ ఇంజనీరింగ్ విభాగంతో ఔట్‌సోర్సింగ్ కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులను నిర్ధాక్షిణ్యంగా ఆగస్టు ఒకటి నుంచి మున్సిపల్ కమిషనర్ విధులనుంచి తొలగించారన్నారు. వారిని వెంటనే విధులలోకి తీసుకొని రావాల్సిన జీతభత్యాలను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. గత పది రోజులుగా దీక్ష చేస్తున్నారని, కక్షపూరితమైన చర్యలను వదలాలని, వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్నారు కాబట్టి కూటమి ప్రభుత్వంలో వారిని తొలగించి కొత్తవారిని పెట్టుకోవాలని ఆలోచన విరమించుకోవాలన్నారు. దీక్షకు ఏఐసీటీయూ, ఎంసీపీఐయూ మద్దతు తెలియజేశారు.

నవంబరు 3న కార్తీక వన భోజనాలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13: కుంకలగుంట వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 3న కార్తీక వనభోజనాలు జరుగుతాయని ప్రధాన కార్యదర్శి షేక్ మహబూబ్ సుభాని అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలోని జీబీఆర్ ఆసుపత్రిలో డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ మహబూబ్ సుభాని మాట్లాడుతూ కార్తీక వనభోజనాలు 14 సంవత్సరాలు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని, ఇది 15వ సంవత్సరం అన్నారు. కార్యక్రమంలో సభ్యులు షేక్ మస్తాన్, అర్వపల్లి హరనాథ్‌బాబు, ముక్కంటి సాంబయ్య, వీర హరనాథ్‌బాబు, బొడ్డుపల్లి శ్రీనివాసరావు, ప్రదీప్ కృష్ణ తదిరులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

● జిల్లా ఎస్సీ వెల్ఫేర్, సాధికార అధికారి ఓబులునాయుడు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డీఎస్సీ శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పల్నాడు జిల్లా ఎస్సీ వెల్ఫేర్, సాధికార అధికారి ఓబులు నాయుడు ఆదివారం తెలిపారు. డీఎస్సీ పరీక్ష కోసం ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలలు శిక్షణ పొందటానికి జేఎన్‌ఏఎన్ ఎబీహెచ్‌యూఎం.ఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్ ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకునేందుకు ఈ నెల 11 నుంచి 21వరకు అవకాశం ఉందన్నారు. ఎస్‌జీటీలకు ఇంటర్మీడియట్‌తో పాటు డైట్ సెట్, టెట్, స్కూల్ అసిస్టెంట్స్‌కు డిగ్రీ గ్రాడ్యుయేషన్, బీఎడ్, టెట్ విద్యార్హతలు కలిగిన వారు అర్హులన్నారు. అభ్యర్థుల కుటుంబ వార్షికాదాయం రూ.2.50లక్షలలోపు ఉన్న విద్యార్థులందరూ అర్హులన్నారు. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాల్‌టికెట్‌లు ఈ నెల 22 నుంచి 25 వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని, 27న పరీక్ష ఉంటుందన్నారు. మెరిట్ లిస్ట్ ఈ నెల 28న ప్రకటిస్తారని, జిల్లాల వారీగా ఎంపికైన లిస్టు 30వ తేదీన ప్రకటిస్తామని వివరించారు. నవంబరు 3న కోచింగ్ సెంటర్ వారీగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, శిక్షణ నవంబరు 6నుంచి ప్రారంభమవుతుందన్నారు.

పోలీసు స్టేషన్‌లో ఆయుధ పూజ

రొంపిచర్ల, అక్టోబరు 13: మండల కేంద్రమైన రొంపిచర్ల పోలీసు స్టేషన్‌లో విజయ దశమి సందర్భంగా శనివారం ఆయుధ పూజలను నిర్వహించారు. ఎస్ఐ అశోక్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సంతాప సభలో నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గొప్ప పోరాట పటిమ కనబరిచిన సాయిబాబు

● పీడీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13: ప్రజలను కదిలించడం, నడిపించడంలో జీఎన్ సాయిబాబా గొప్ప పోరాట పటిమ కనబరిచారని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని గాంధీపార్కు వద్ద ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబుకు ప్రజా సంఘాల నాయకులు నివాళి అర్పించారు. జీఎన్ సాయిబాబు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలం కుట్ర కేసులలో జైలు జీవితం అనుభవించి, జైలులోనే అనేక జబ్బులతో, మరణపు అంచుల్లోకి వెళ్ళి, ఇటీవల ముంబై కోర్టు నిర్దోషిగా విడుదల చేసిందన్నారు. జైలు జీవితంలో ఏర్పడిన అనారోగ్య సమస్యలు చుట్టుముట్టి అమరుడయ్యాడన్నారు. కార్యక్రమంలో నల్లపాటి రామారావు, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి రెడ్ బాష, పౌరహక్కు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, చైతన్య గ్యాస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకుడు షేక్ శిలార్, పీడీఎం జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కవి కరిముల్లాకు అబ్దుల్ కలాం అవార్డు



కవి కరిముల్లాను సన్మానిస్తున్న రాష్ట్ర నూర్‌బాషా సంఘం నాయకులు

వినుకొండ, అక్టోబరు 13: కడప జిల్లా, పొద్దుటూరులో జరిగిన నూర్ బాషా ఉద్యోగుల సంఘం సమావేశంలో ఆదివారం వినుకొండ పట్టణానికి చెందిన కవి కరిముల్లాను ఏపీజె అబ్దుల్ కలాం అవార్డుతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందచేశారు. ఈసందర్భంగా విశ్రాంతి డీఎస్పీ మహబూబ్‌బాషా మాట్లాడుతూ కవి కరిముల్లా రాసిన కవితలను గూర్చి కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నూర్ బాషా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పీ సిద్దయ్య, కార్యదర్శి ధర్మారం బాజి, లాల్ వజీర్, వేపల్లి అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



రాజరాజేశ్వరిదేవి అలంకారంలో యడ్లపాడు శివాలయంలో పార్వతీదేవి, కొచ్చెర్ల అంకాళ పరమేశ్వరి, రొంపిచర్ల వాసవి దేవి, విప్పర్ల కామాక్షి అమ్మవార్లు

ఘనంగా ముగిసిన దసరా ఉత్సవాలు

నరసరావుపేట, అక్టోబరు 13: విజయదశమి పర్వదినాన్ని జిల్లా అంతటా వైభవంగా జరుపుకున్నారు. దసరా నవరాత్రుల ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని దర్శించుకొని భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నరసరావుపేట పట్టణంలోని పాతూరులోని గంగా పార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం చేశారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం చేశారు. వాసవి అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. పార్వేట ఉత్సవం నిర్వహించారు. జమ్మి చెట్టుకు పూజలు చేశారు. అనంతరం పాల పిట్టను దర్శనం చేసుకున్నారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆయల కమిటీ సభ్యులు, అధికసంఖ్యంలో భక్తులు పాల్గొన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ పూజ ఘనంగా చేశారు. ఎస్పీ కె.శ్రీనివాసరావు దంపతులు, జిల్లా పోలీసు అధికారులు ఆయుధ పూజలో పాల్గొన్నారు. పోలీస్ సిబ్బందికి పూజ అనంతరం భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ లక్ష్మీపతి, నరసరావుపేట డీఎస్పీ కే నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ గాంధీ రెడ్డి, సీఐలు, ట్రాఫిక్ సీఐ, ఆర్ఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. వాసవి కళ్యాణ మండపంలో బతుకమ్మ, అమ్మవారి బొమ్మల అలంకరణ పోటీలు నిర్వహించారు. నరసరావుపేటలోని రెడ్డినగర్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం బతుకమ్మ ఊరేగింపు నిర్వహించారు. సత్యసాయి దేవాలయంలో రావణ సంహార కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల చౌడేశ్వరిదేవి ఆలయంలో ఉత్సవాల ముగింపు సందర్భంగా చండీ యాగం జరిపారు.

● వినుకొండ: మండలంలోని విఠంరాజుపల్లి సమీపంలోని శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో హిమాలయ గురువులు సహకారంతో దసరా పండుగ సందర్భంగా శనివారం రాజ శ్యామలయాగం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిమాలయ గురూజీని ఎమ్మెల్యే దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారితో పాటు ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు అనంత కోటేశ్వరరావు, పెండ్యాల మోహన్‌రావు, పుల్లారావు, కాశీ, కొప్పురావూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో ఆయుధ పూజలో పాల్గొన్న ఎస్పీ కె శ్రీనివాసరావు దంపతులు

● యడ్లపాడు: ఈ నెల 3న ప్రారంభమైన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. తొమ్మిది రోజులపాటు వివిధ అలంకారాలలో దర్శనమిచ్చిన అమ్మవారు పదో రోజైన శనివారం శాంతమూర్తి అవతారమైన రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పట్టువస్త్రాలు, వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేక అలంకరణ గావించి ట్రాక్టర్లపై గ్రామోత్సవం నిర్వహించారు.

● రొంపిచర్ల: మండలంలోని బుచ్చిపాపన్నపాలెంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటుచేసిన బతకమ్మ తల్లి ఊరేగింపు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం పాల్గొన్నారు. ముందుగా నీలంపాటి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట వైసీపీ నాయకులు పచ్చవ రవి, వీరం భాస్కర్‌రెడ్డి, పి.వెంకటరావు, పి.సుబ్బారెడ్డి, జి.ముసలారెడ్డి, పి.హనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు శనివారంతో రొంపిచర్ల, వడ్లమూడివారిపాలెం, విప్పర్ల, కొత్తపల్లి, వీరవట్నం గ్రామాల్లో నవరాత్రులు నిర్వహించారు. అలవాల, గోగులపాడు, బుచ్చిపాపన్నపాలెం గ్రామాల్లో బతుకమ్మలను ఏర్పాటు చేశారు. రొంపిచర్ల వాసవి అమ్మవారి ఆలయంలో చండీ హోమం, సెమీ పూజ నిర్వహించారు. సాయంత్రం కోలాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రొంపిచర్లలోని చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు.

● వినుకొండ: బోస్ బొమ్మ సెంటర్‌లోని వాసవి కన్యకాపరమేశ్వరి



వినుకొండఅంకాలమ్మ దేవస్థానంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



బతుకమ్మలను తలపై పెట్టుకొని రావులాపురంలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

దేవాలయంలో ఆర్యవైశ్య సదావర్తి సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు మంత్రోచ్చరణతో హోమాలు నిర్వహించారు. ఏనుగుపాలెం రోడ్డులోని అంకాలమ్మ దేవస్థానం ఆవరణలో జమ్మిచెట్టుకు భక్తులు వైభవోపేతంగా పూజలు నిర్వహించి భక్తిని చాటుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి కొల్లి హనుమంతరావు, శివలింగంతో పాటు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వాసిరెడ్డి పాపారావు, శంకరావు, జి.లక్ష్మీసత్యనారాయణ, శివకోటేశ్వరావు, శ్రీరామ్‌శెట్టి సాంబశివరావు, నల్లూరి కటేశ్వరరావు, తారక్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండల కేంద్రం నూజెండ్ల, వీ అప్పాపురం చెన్నకేశవ స్వామి దేవాలయం, రవ్వవరం వెంకటేశ్వర జగన్మాతపీఠం, ఐనవోలు జెడ్డా వారిపాలెం, ములకలూరు దేవాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

● ఈపూరు: దసరా వేడుకలను మండలంలో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో బతకమ్మలను ఏర్పాటుచేసి తొమ్మిది రోజులు పూజలుచేసి శనివారం రాత్రి ఊరేగించి కాలువ నీటిలో నిమజ్జనం చేశారు. కొచ్చెర్లలో అంకాళ పరమేశ్వరిని అమ్మవారిని బంతిపూలతో అలంకరించి పూజలు చేశారు. అదేవిధంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.

● బొల్లాపల్లి: మండలంలోని వెల్లటూరు, పేరూరుపాడు, వడ్డెంగుంట, బొల్లాపల్లి గ్రామాల్లో తొమ్మిది రోజుల పాటు జరిగిన దేవీ నవరాత్రుల ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఆయా దేవాలయాల వద్ద భక్తులకు భారీగా ప్రసాదాలను పంపిణీ చేశారు.

● బొల్లాపల్లి: మండలంలోని రావులాపురంలో బతుకమ్మలను గ్రామంలో భారీగా ఊరేగింపు నిర్వహించారు. కొత్త మాసు సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. బతుకమ్మ సంబరాలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం సమీపంలోని చెరువుల్లో బతకమ్మలను నిమజ్జనం చేశారు.

● నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాలు, చలువ పందిళ్లల్లో రాజరాజేశ్వరిదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఆయా గ్రామాల్లో దేవతా మూర్తులను ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు.

ఎత్తి పోతల పథకం వద్ద రైతుల పూజలు

దసరాను పురస్కరించుకొని గణపవరం గ్రామంలోని వరసిద్ధి వినాయక ఎత్తిపోతల పథకం వద్ద రైతులు పూజలు చేశారు. ఎత్తిపోతల పథకం వద్ద ఉన్న విద్యుత్ సామగ్రి చోరీకి గురికావటంతో అద్దె పద్ధతిపై తెచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి ఎత్తిపోతల ట్రయల్ రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగళ్ళు పొంగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇసప్పాలెం వాసవి అన్నదాన సత్రంలో అన్నదానం

నరసరావుపేట రూరల్: ఇస్సపాలెంలోని వాసవి అన్నదాన సత్రంలో ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహంకాళి ఆలయంలో అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ వాసవి అన్నదాన సత్రంసేవ కార్యక్రమాలను అభినందించారు. 250మందికి ప్రతి ఆదివారం అన్నదానం ఏర్పాటు చేయటం సంతోషమని తెలిపారు. మహంకాళి అమ్మవారి దేవస్థానం ఎంతో మహిమ కల్గిన ఆలయం కావటంతో పట్టణంతో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ఆదివారం దర్శనం, మొక్కులు చెల్లించేందుకు భక్తులు వస్తారని తెలిపారు. కమిటీ సభ్యులు, దాతలు ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో నిర్వహించాలని, వారికి తమవంతు ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు, కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు కపలవాయి విజయకుమార్, ఏఎస్పీ సాంబశివరావు, ఊర భాస్కర్‌రావులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

కాపులు ఐకమత్యంతో ముందుకు కదలాలి

● కాపు సంఘం రాష్ట్ర నాయకుడు వీర బ్రహ్మం

వినుకొండ టౌన్, అక్టోబరు 13: కాపులు అధిక సంఖ్యలు ఉన్నప్పటికీ ఐక్యత లేకపోవడంతో, అన్నిరంగాలలో వెనుకబడి ఉన్నారని, ఐకమత్యంతో ప్రతిఒక్కరూ ముందుకు కదలాలని రాష్ట్ర కాపు సంఘం నాయకులు, ప్రకాశం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం తెలిపారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని కేజీఎల్ కల్యాణ మండపంలో జైవీరాంజనేయస్వామి సేవా సంఘం ఆధ్వర్యంలో మాజీ సర్పంచి ఎలిశెట్టి నరసింహారావు అధ్యక్షతన ఆదివారం కాపు సంఘం బంధువుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శాసనాల వీరబ్రహ్మం మాట్లాడుతూ ఉన్నత ఆలోచనలతో సమిష్టి నిర్ణయాలతో, స్వయం సంవృద్ధితో అన్నిరంగాల్లో రాణిస్తూ సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని కోరారు. రోజు రోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ఆర్థిక సంబంధాలే కాకుండా, మానవ సంబంధాలు మెరుగు పరుచుకునేందుకు ఇలాంటి ఆత్మీయ సమావేశాలు అవశ్యమని చెప్పారు. అనంతరం 70 సంవత్సరాలు పైబడిన పెద్దలను నిర్వాహకులు పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాలవ రామ్‌మోహన్‌రావు, చలమయ్య, ఆదినారాయణ, సత్యం నారాయణ, నాగ సైదులుతోపాటు వివిధ జిల్లాల నుంచి సభ్యులు పాల్గొన్నారు.



కాపుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కాపు నాయకులు, ప్రకాశం జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి శాసనాల వీరబ్రహ్మం



సద్గురు షిరిడీ సాయిబాబా ఆరాధన మహోత్సవంలో పాల్గొని పూజలు చేస్తున్న జీవీ, మక్కెన

ఏడాదిలో ఘాట్ నిర్మాణం పూర్తిచేస్తాం

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 13: పట్టణంలోని సాయి బాబా దేవాలయంలో 64 ఆరాధన మహోత్సవాలు వేదపండితుల మంత్రోశ్చరణతో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయు పాల్గొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినుకొండపై కొలువైన రామలింగేశ్వర స్వామి గుడికి ఏడాదిలోపు ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తామని, అందుకు కావల్సిన నిధులు మంజూరు చేసిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబుకు ఈసందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాతలు సహకరిస్తే ఆలయానికి మరిన్ని సౌకర్యాలతో అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవచ్చని తెలిపారు. ఆదేవిధంగా ఎన్ఎస్‌పీ కాలనీ ఆవరణలో టీటీడీ కళ్యాణ మండపానికి మూడు కోట్లు, ఘాట్ రోడ్డుకు రెండు కోట్లు చంద్రబాబును అడగగానే మంజూరు చేశారన్నారు. త్వరలోనే టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తామన్నారు. అనంతరం సీతారాములు కల్యాణం కనుల విందుగా నిర్వహిస్తున్న కమిటీకి బ్రహ్మణులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వరద బాధితులకు విరాళం

చిలకలూరిపేట, అక్టోబరు 13: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణానికి చెందిన పలువురు స్థానిక శాసన సభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్‌ను కలిసి చెక్కులు అందచేశారు. స్థానిక చైతన్య లిటిల్స్ విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది విరాళం స్కూల్ డైరెక్టర్ ఈవీ గిరిష్‌బాబు ద్వారా రూ.2.5లక్షల చెక్కును ఇచ్చారు. గుంటూరుకు చెందిన విజేత విద్యాలయం నిర్వాహకులు మిన్నెకంటి శ్రీనివాసరావు, ఈవీ గిరిష్‌బాబు మరో రూ.2.5 లక్షల చెక్కును అందచేశారు. అల్లం ఇందిరా దేవి రూ.2.05 లక్షలు, డాక్టర్ బి.శారదాంబ రూ.50వేలు, డాక్టర్ కందిమళ్ళ జయమ్మ రూ.25వేలు, కరణం విజయ రూ.25 వేలు, వి.సావిత్రి, రూ.10వేలు, ఏ శైలజ రూ.10వేలు, బైకా శివకుమారి రూ.10 వేలు, ఎస్.ఇందిర రూ.10వేలు సాయం అందించిన వారిలో ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నాదెండ్ల, అక్టోబరు 13: అనారోగ్యాన్ని తాళలేక పురుగు మందు తాగిన గణపవరం గ్రామానికి చెందిన షేక్ జానీ బాషా (46) మృతి చెందాడు. ఆయనకు భార్య రషీద, ఇద్దరు సంతానం ఉన్నారు. కొన్నేళ్ళుగా జానీ బాషా పక్షవాతంతో బాధ పడుతున్నాడు. ఈ క్రమంలో గడిచిన 11వ తేదీ సాయంత్రం గడ్డి మందు తాగాడు. పరిస్థితి విషమించటంతో గుంటూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా శనివారం ఉదయం చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. భార్య రషీద ఫిర్యాదు మేరకు నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వృత్తి విద్యపై ముగిసిన అవగాహన సదస్సు

వినుకొండ టౌన్, అక్టోబరు 13: టైమ్స్ సెంటర్ ఫర్ లెర్నింగ్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో నూజెండ్ల మండలంలోని ఉప్పలపాడు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థునులకు ఫుడ్‌ప్రాసెసింగ్ వృత్తి విద్యా ఇంటర్ షిప్ ముగింపు కార్యక్రమంలో పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో ఆదివారం ఆహార పదార్థాల తయారీపై అవగాహన కల్పించారు. అనంతరం బేకరీలను సందర్శించి స్వీట్లు, కేక్‌లు తయారీపై విద్యార్థునులకు వివరించారు. కార్యక్రమంలో వృత్తి విద్యాకోర్సు ట్రైనింగ్ టీచర్ ఎ.ఉషారాణి, విద్యార్థునులు పాల్గొన్నారు.

రెండు ఆలయాల్లో చోరీ

ఈపూరు, అక్టోబరు 13: మండలంలో రెండు ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన ఆదివారం వెలుగుచూసింది. ఈపూరు బోటు మీద ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, వనికుంట వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయాల తలుపులకు ఉన్న తాళాలు పగలకొట్టి లోపలకు వెళ్ళి హుండీలను ధ్వంసం చేసి అందులోని కానుకలు దోచుకువెళ్ళారు.



సురేష్ మహల్ రోడ్డులో ఎస్‌బీఐ బజార్ ఆర్బీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

చిరస్మరణీయుడు నందమూరి తారక రామారావు

● ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ టౌన్, అక్టోబరు 13: చరిత్ర ఉన్న కాలం తెలుగు జాతి ఎప్పటికీ మరిచిపోలేని వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ సురేష్ మహల్ రహదారిలో ఆర్బీ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కారణ జన్ముడు శతజయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ భౌతికంగా దూరమైనా ఆ రూపం, అన్నగారు అనే పిలుపు శాశ్వతంగా నిలిచి ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పోట్ల రాధాకృష్ణమూర్తి, కౌన్సిలర్ పాపసాని బ్రహ్మయ్య, గుడివాడ గురునాధం, ఆరే శివారెడ్డి, బాలరెడ్డి, రామాంజనేయులు, మంత్రిరాజు సత్యనారాయణ. శివయ్య, షమీమ్, పీవీ సురేష్, పత్తి పూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జీవీ

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

వినుకొండ, అక్టోబరు 13: పేదవారికి ముఖ్యమంత్రి సహాయనిధి ఆపన్నహస్తంలా ఆదుకుంటున్నదని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి కింద నాగులవరం గ్రామానికి చెందిన గాదు చిన్నకొండయ్యకు రూ.2.80లక్షలు, అగ్నిగుండాలకు చెందిన భూక్యాకోటీనాయక్ రూ.1.02లక్షలు, కారుమంచికి చెందిన రావెళ్ల హనుమాయమ్మకు రూ.81వేలు, వినుకొండ పట్టణానికి చెందిన టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ అయూబ్ ఖాన్‌కు రూ.2.74లక్షలు విలువైన చెక్కులను జీవీ ఆందజేయులు శనివారం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా సీఎం సహాయనిధి అవసరం ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. వైసీపీ పాలనలో సీఎం సహాయనిధి ఎవరికీ అందేది కాదని, ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి పేదవాడికి సీఎంఆర్ఎఫ్ కింద సాయం అందు తుందని చెప్పారు. ఆపదకాలంలో ఆదుకునే సీఎం సహాయనిధి సద్వినియోగం చేసుకోవాలని జీవీ తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గోనుగుంట్ల హనుమంతరావు, వెంకటరెడ్డి, గంగయ్య, గోవిందరాజులు, షమీమ్ ఖాన్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంప్రసాద్ స్కాన్ సెంటర్ ప్రారంభం



స్కాన్ సెంటరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

నరసరావుపేట లీగల్, అక్టోబరు 13: పట్టణంలోని నిమ్మతోటలో రాంప్రసాద్ స్కానింగ్ సెంటర్‌ను నరసరావుపేట శాసన సభ్యుడు డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆదివారం ప్రారంభించారు. సెంటర్లోని వివిధ విభాగాలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చీరాల శాసన సభ్యుడు ఎం మాలకొండ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు మాట్లాడుతూ విశేష అనుభవం కలిగిన డాక్టర్ రాంప్రసాద్ ఆధ్వర్యంలో స్కానింగ్ సెంటర్ ప్రారంభించడం వలన పట్టణ ప్రజలకు ఎంతో సహాయకారిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ రాంప్రసాద్ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన సీనియర్ వైద్యులు డాక్టర్, డా ఏ రామ్మోహనరావు, డాక్టర్ గొంది సాంబశివరావు, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, డాక్టర్ శ్రీనివాసరావు, ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ లకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, నరసరావుపేట డీఎస్పీ కొమ్మనబోయిన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు

నరసరావుపేట రూరల్, అక్టోబరు 13: పట్టణంలోని సత్తెనపల్లి రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పస్వామికి పంచామృతాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామివారి భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పసుపు, కుంకం, విబూది, గంధం, పన్నీరు, కొబ్బరినీరు, పంచదార, తేనె, ఫలాలతో ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మాల ధరించిన స్వాములకు బిక్ష అందజేశారు.